ఆదివారం

9 జూన్, 2024

వార్త



# బడులకు సిద్ధం..

# ఫీజుల యుద్ధం!





# మరోసారి 'ధమాకా' కాంబినేషన్?

మాస్ మహారాజా రవితేజ హీరోగా ఇప్పుడు పలు ఆసక్తికరమైన చిత్రాలు చేస్తుండగా దర్శకుడు త్రినాథరావు నక్కినతో చేసిన సాలిడ్ హిట్ చిత్రం 'ధమాకా' ఒకటి. ఈ చిత్రంతో యంగ్ హీరోయిన్ శ్రీలీల కూడా టాలీవుడ్‌లో సెన్సేషన్‌గా నిలిచింది. ఈ సినిమాతో మోస్ట్ ఎనర్జిటిక్ పెయిర్‌గా మారారు రవితేజ, శ్రీలీల. ఈ కాంబినేషన్‌లో మరో సినిమా రానుందని తాజా సమాచారం. రవితేజ 75వ చిత్రంగా ఈ ప్రాజెక్ట్‌కి ఈమె లాక్ అయినట్టు సమాచారం. దీనిపై అధికారిక సమాచారం రావాల్సి ఉంది. ఈ చిత్రాన్ని భాను బోగవరపు ఒక పక్కా ఎంటర్టైనర్‌గా తెరకెక్కించనున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాకు సితార ఎంటర్టైన్‌మెంట్స్ వారు నిర్మాణం వహిస్తున్నట్లు సమాచారం.

## తారాతీరం



# 'బచ్చలమల్లి'గా అల్లరి నరేశ్!

'నా సామిరంగ'లో ఒక కీలకమైన పాత్రను చేసిన ఆయన ఆ తరువాత 'ఆ ఒక్కటీ అడక్కు' అంటూ కామెడీకి రొమాంటిక్ టచ్ ఇచ్చాడు. అలాంటి నరేశ్ ఈసారి కామెడీకి మాస్ యాక్షన్ టచ్ ఇవ్వడానికి సిద్ధమవుతున్నాడు.

అల్లరి నరేశ్ ప్రస్తుతం చేస్తున్న సినిమా 'బచ్చలమల్లి'. హాస్య మూవీస్ బ్యానర్ రాజేశ్ దండా నిర్మిస్తున్న ఈ సినిమాకి, సుబ్బు దర్శకత్వం వహిస్తున్నాడు. విశాల్ చంద్రశేఖర్ సంగీతం సమకూరుస్తున్నారు. ఇందులో రిక్షా నడిపే వ్యక్తిగా 'బచ్చలమల్లి' పాత్రలో అల్లరి నరేశ్ కనిపించనున్నాడు. 'తుని' నేపథ్యంలో ఈ కథ నడుస్తుందని అంటున్నారు.

ఆదివారం వార్త

9 జూన్, 2024

## మంచి ముత్యాలు

ప్రేమ ఎప్పుడూ నగరాలలో నివసించదు. గ్రామీణ గృహాలలోనే అది ఆనందం పొందుతుంది.

- జాన్ గే

## విషయ విశేషం


నిద్రపుచ్చే ఆప్ కథలు... 4

'సంఘీ'భావం....5

విత్తనాల కోసం రైతన్న ఆగమాగం

కవర్ స్టోరీ..6

బడులకు సిద్ధం..
ఫీజుల యుద్ధం!

ఆరోగ్య సేవలు...11

ఈవారం కవిత్వం..12

వెన్నెల ధారలు

నయా మాయా దర్పణం..14

వాల్మీకి గుహలను చూద్దామా....18

కథ.. 20

రైలు ప్రయాణం

సాహిత్యం..23

'తెలుగు' గాలికొదిలేస్తే!

రాహు-కేతు పూజలకు ప్రసిద్ధి..26

పరిస్థితులు మారాలంటే?..29

ఇంకా..

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం

వగైరా..వగైరా..


## తాజా వార్తలు

### వాపునకు కారణం



కరోనాతో కోట్లాది మరణాలు చోటుచేసుకున్నాయని మనం ఇట్టే చెప్పేస్తుంటాం కానీ..నిజానికి ఆ మరణాలకి కారణం-కొవిడ్ కాదు, ఆ వైరస్‌ని చూసి అతిగా స్పందించిన మన రోగనిరోధక వ్యవస్థ. దగ్గు, శ్వాస అందకపోవడం, ఊపిరితిత్తుల్లో అల్లకల్లోలం..ఇవన్నీ ఆ స్పందనలో భాగాలే. 'సైటోకైన్ స్టార్మ్' అనేవారు అప్పట్లో ఈ లక్షణాలని మనం కిందపడి కాలోచేయో దెబ్బతగిలితే అక్కడ వెంటనే వాపు వస్తుంది కదా..ఇది కూడా అలాంటిదే. ఈ స్పందనలనే..స్థూలంగా 'ఇన్‌ఫ్లమేషన్ (వాపు స్వభావం) అంటారు. ఓ స్థాయి వరకూ ఇది మనకు మంచే చేస్తుందికానీ శ్రుతిమించితే మాత్రం ఎన్నో ఇబ్బందులకి కారణమవుతుంది. అందుకే దీని రహస్యాన్ని పట్టుకోవాలని శాస్త్రవేత్తలు ఎంతోకాలంగా చేస్తున్న పరిశోధనలు ఇప్పుడు ఓ ముఖ్యమైన మైలురాయిని చేరుకున్నాయి. కొలంబియాకి చెందిన శాస్త్రవేత్తలు మెదడు కాండం (బ్రెయిన్ స్టెమ్ మెడపైభాగాన్నీ మెదడునీ కలిపే భాగం)లో ఉన్న 'సీఎన్ఎస్‌టీ'లోని న్యూరాన్లే ఈ ఇన్‌ఫ్లమేషన్‌ని కలిగిస్తున్నాయని కనిపెట్టారు. ఎలుకల్లో జరిగిన పరిశోధనల్లో వీటిపాత్రని స్పష్టంగా చూడగలిగారట. ఎయిర్ కండిషనర్‌లో చల్లదనాన్ని నియంత్రించినట్టే ఇవి మన ఇన్‌ఫ్లమేషన్‌ని నియంత్రిస్తున్నాయని వాళ్లు చెబుతున్నారు.

రామయ్య: అదేంటండీ సైకిల్ కిందపడేసి అలా తొక్కేస్తున్నారేంటి?
ఎల్లయ్య: సైకిల్ తొక్కడం ఆరోగ్యానికి మంచిదని డాక్టర్ చెప్పారండీ.

...

గోపి: ఎందుకమ్మ ఏడుస్తున్నావ్? తప్పిపోయావా?
చిన్నపాప: లేదు అంకుల్, మా అమ్మానాన్నలే తప్పిపోయారు. వారెక్కడ ఉన్నారో అని ఏడుస్తున్నాను..

...

టీచర్: రాజూ! దోమ గురించి నీకేం తెలుసో చెప్పు?
రాజు: ఎంత వీరుడైనా, అరవీర భయంకరుని రక్తాన్ని సైతం పీల్చే గుణం దోమకు ఉంది సార్.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com

# నిద్రపుచ్చే ఆప్ కథలు



చాలామందికి ఓ పట్టాన నిద్రపట్టదు. అందుకు ఎన్నో ప్రయత్నాలు చేస్తుంటారు. పడుకునేముందు పుస్తకాలు చదవమని, సెల్‌ఫోన్లను చూడవద్దని..ఇలా తోచిన సలహాలు ఇస్తుంటారు. మనం చిన్నప్పుడు అమ్మలు, అమ్మమ్మలు చెప్పే కథలను వింటూ నిద్రలోకి జారుకునేవారం. అచ్చంగా అలాగే కథలు చెప్పే 'ఆప్'లో కథలు వింటూ కునుకుతీసేవాళ్ల సంఖ్య పెరుగుతోందిప్పుడు. సంగీతం, ధ్యానం, ప్రకృతి సవ్వడులతో నిద్ర తెప్పించే ఆప్‌లు ఇదివరకే ఉన్నాయి. వాటికి కథల్నీ జోడిస్తూ కొత్త అనుభూతుల్ని పంచేవి ఇప్పుడొస్తున్నాయి. కొత్త ఊహాలోకాల్లోకి తీసుకెళ్లి జోకొడుతున్నాయి. రాకేశ్‌ని ఈ మధ్యే ఓ కొత్త ప్రాజెక్టుకోసం టీమ్ లీడ్‌గా ఎన్నుకున్నారు. హోదా పెరిగిందన్న ఆనందం, తానేమిటో నిరూపించుకోవాలన్న ఉత్సాహం, కొత్త సవాళ్ల సంక్షోభం- వెరసి అతనిలో ఒత్తిడిగా మారాయి. రాత్రి పదకొండు కల్లా నిద్రకి ఉపక్రమించినా ఆలోచనల రొదతో 12వరకూ కునుకు పట్టేది కాదు. మధ్యలో ఏ నాలుగ్గంటలకో మెలకువ వచ్చి ఆపై నిద్రరాక ఇబ్బందిపడేవాడు. మళ్లీ ఎప్పటికో నిద్రపట్టి, తొమ్మిదిన్నరకి మెలకువచ్చి, టిఫిన్ తినడానికి టైమ్‌లేక ఆఫీసుకెళ్లేవాడు. రోజూ ఇదే వరసగా మారి అతనికి పేగు అల్సర్ ఏర్పడింది. డాక్టర్లు అల్సర్‌కి చికిత్స ఇస్తున్నారు కానీ నిద్రలేమికి మందులు వద్దన్నారు. ధ్యానంలాంటివి ప్రయత్నించమన్నారు. అందుకోసం ఆన్‌లైన్‌లో వెతుకుతుండగా అతనికి 'నీంద్' ఆప్ కనిపించింది. చిన్నప్పుడు తాతయ్య చెప్పిన పరమానందయ్య శిష్యుల కథలూ, పదో తరగతిలో చదివిన 'బారిష్టర్ పార్వతీశం' నవలా భాగాలూ-వంటివాటితో నిద్రతెప్పిస్తామన్న వాళ్ల హామీలు చూసి ఆశ్చర్యపోయాడు. డౌన్‌లోడ్ చేసుకున్నాడు. మొదటిరోజు 15 నిమిషాల 'పరమానందయ్య' కథ పూర్తవ్వకముందే నిద్రలోకి జారుకున్నాడు. ఉదయం ఏడుకి మెలకువస్తే -హాయిగా ఫీలయ్యాడు. అలా మరో వారంలోనే గాఢనిద్రకి దగ్గరకాగలిగాడు.

## కోట్లలో వ్యాపారం

రాకేశ్ వాడిన 'నీంద్' ఒక్కటే కాదు..ప్రపంచవ్యాప్తంగా కథలతో నిద్రతెప్పించే ఆప్‌లు ఎన్నో పుట్టుకొస్తున్నాయిప్పుడు. వీటి మార్కెట్ విలువ ఈ ఏడాదికి సుమారు తొమ్మిదివేల కోట్ల రూపాయలు. 2031 నాటికల్లా అది సుమారు 22వేల కోట్ల రూపాయలకి చేరొచ్చని అంచనా వేస్తున్నారు. చదువూ, కెరీర్, మానవ సంబంధాలు, జీవనశైలి, వినోద మాధ్యమాలు కారణం ఏదైనా సరే నేటి ఆధునిక మానవుని నిద్ర తగ్గింది. కొత్తగా వీటికి కరోనా ప్రభావం కూడా తోడైంది. కొవిడ్ బాధితుల్లో 40శాతం మందికి ఈ సమస్య ఉందని చెబుతున్నారు. 'నీంద్' ఆప్ సృష్టికర్త సురభి జైన్ కూడా వారిలో ఒకరట. కరోనా నుంచి బయటపడ్డ ఏడాదిదాకా నిద్రలేమితో బాధపడ్డ ఆమెకి 'వైసా స్లీప్' అన్న ఆప్ ఎంతో పయోగపడిందట. ఈ ఆప్‌లో అమెరికాకి చెందిన మిషెల్లీ హాట్‌లింగ్ అనే 'మెడిటేషన్ ఆర్టిస్ట్' పెద్దల కోసం చెప్పే నిద్ర కథలు ఉంటాయి. ఇలాంటి ఆప్‌ని భారతీయ కథలతో ఎందుకు తీసుకురాకూడదన్న ఆలోచనతోనే సురభి నీంద్ (మిథిలీలో నిద్ర అని అర్థం)ని రూపొందించారు. హిందీతోపాటూ తెలుగు, తమిళం, మరాఠీ, ఇంగ్లిషు భాషల్లో ఉన్న ఈ నిద్ర కథల ఆప్‌కి ఇప్పుడు ఐదులక్షలమంది చందాదారులున్నారు. ఆయా భాషల్లోని జానపద కథల్ని -స్థానిక వాయిస్ ఆర్టిస్టులతో చెప్పిస్తూ చక్కటి నాణ్యతతో నీంద్‌ని తీర్చిదిద్దుతోంది సురభి. 'అలోరా స్లీప్' ఆప్ కూడా ఇలాంటిదే. సుమారు 20 లక్షల డౌన్‌లోడ్‌లున్నాయి దీనికి. ఈ రెండింటికన్నా ముందే మార్కెట్‌లోకి వచ్చిన 'వైసా స్లీప్' గూగుల్ ప్లే స్టోర్‌లో 'ది బెస్ట్ ఆప్'గా గుర్తింపు పొందింది. ఇదంతా చదివి 'అసలు ఎలక్ట్రానిక్ తెరలతో నిద్ర రాదు అని నిపుణులు చెబుతుంటే వీటితో నిద్రెలా పడుతుంది?' అని సందేహం రావచ్చు. అందుకు జవాబుగా-'నిద్రని చెడగొట్టే 'బ్లూరేస్'ని వెదజల్లని రీతిలోనే మా ఆప్‌లని రూపొందిస్తున్నాం. అందరూ చెడుచేస్తుందంటున్న సాంకేతికతని మేం మంచి కోసం వాడుతున్నాం' అంటున్నారు వీటి సృష్టికర్తలు. నిద్రలేమికి కునుకు పట్టకపోవడం కన్నా ఆలోచనలు రొదపెట్టడమే ప్రధాన కారణం. కాబట్టి ఈ ఆప్‌లు కథల ద్వారా మన ఆలోచనల్ని పక్కకు మళ్లించడానికి ప్రయత్నిస్తాయి. అందుకే క్షణక్షణం ఉత్కంఠరేపే కథలు కాకుండా ఆహ్లాదకర వర్ణనలూ, హాస్య సంభాషణలున్న ఇతివృత్తాల్ని ఈ ఆప్‌ల కోసం ఎంచుకుంటున్నారు. మన పక్కన ఆత్మీయులొకరు కూర్చుని చెబుతున్నట్టే వీటిని రికార్డు చేస్తున్నారు. ముందుగా మన శరీరభాగాల్ని ధ్యానంలోలాగా మానసికంగా రిలాక్స్ చేయించి ఆ తర్వాత మెల్లగా కథలోకి తీసుకెళుతున్నారు. కథకుల కంఠం వినా-మన చుట్టూ అలముకునే వింత నిశ్శబ్దం (వైట్‌నాయిస్),ప్రకృతి సవ్వడులు మనల్ని కొత్త లోకాల్లో విహరించేలా చేస్తాయి. అటునుంచి గాఢనిద్రలోకి తీసుకెళతాయి. ●

'సంఘీ' భావం



# విత్తనాల కోసం రైతన్న ఆగమాగం

రాష్ట్రంలో పరిస్థితి చూస్తుంటే వ్యవసాయ పనులకు బదులు రైతులకు కష్టాల సీజన్ ప్రారంభమైనట్లుగా ఉంది. సరైన ప్రణాళిక లేకపోవడం, అధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయి పరిశీలన జరపకపోవడం వంటి అనేక కారణాలు రైతులకు శాపంగా మారుతున్నాయి. ప్రతి సీజన్‌లో రొటీన్‌గా అవే సమస్యలు వెంటాడుతున్నాయి. ప్రకృతి వైపరీత్యాల సమస్య ఒకటైతే అంతకు మించి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా వ్యవహరించకపోవడం వల్ల కలిగే నష్టాలే అధికంగా ఉంటున్నాయి. సీజన్ ప్రారంభమయ్యే సరికి రైతులు పొలాలను దుక్కిదున్ని పంటలు వేయడానికి భూమిని సిద్ధం చేసుకుంటారు. తొలకరి ప్రవేశించడానికి ముందే మరికొన్ని పనులు చేసుకోవడంలో రైతులు నిమగ్నం అవుతారు. అందులో ప్రధానమైనది, ప్రాథమికమైనది విత్తనాల సేకరణ. విత్తనాలు సిద్ధం చేసుకుంటే తొలకరి నాటి నుంచి రైతులు పొలం పనుల్లో నిమగ్నం అవుతారు. ఇది ప్రతి సంవత్సరం కొనసాగే ప్రక్రియ. వేసవికాలం ముగుస్తుండగానే రైతులు పొలం పనులపై దృష్టి సారిస్తారు. ప్రస్తుతం విత్తనాలు సేకరించి సిద్ధం చేసుకునే ప్రయత్నంలో రైతులు ఉన్నారు. అయితే వారికి విత్తనాలు అందించడంలో ప్రభుత్వం విఫలం అవుతోంది. ఈ వైఫల్యం ఏ ఒక్క సీజన్‌కో పరిమితం కాకుండా ప్రతిసారీ ఇదే సమస్య పునరావృతం అవుతూ ఉంటుంది. రైతులు విత్తనాల కోసం పడిగాపులు కాస్తున్నారు. తెల్లవారుజామునే ఆగ్రో సంస్థల, దుకాణాల వద్దకు చేరుకుని నిద్రాహారాలు మానుకుని విత్తనాల కోసం కళ్లలో ఒత్తులు వేసుకుని ఎదురుచూస్తున్నారు. అయితే వారికి కావల్సిన మేరకు విత్తనాలు లభించడం లేదు. ఆలస్యంగా వస్తే అవి కూడా లభించడం లేదు. నాలుగు ఎకరాల రైతుకు ఏమేరకు విత్తనాలు అవసరమో దానికి సరిపడా విత్తనాలు అందిస్తే రైతులు పొలం పనుల్లో నిమగ్నం అవుతాడు. అయితే రైతుకు ఎంత అవసరమో అందులో సగానికి కంటే తక్కువ విత్తనాలు ఇస్తున్నారు. దీనితో రైతులు ప్రతి రోజూ ఆగ్రో దుకాణాల చుట్టూ తిరుగుతూ సమస్యలను ఎదుర్కొంటున్నారు. ప్రతి రైతుకు పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్నాయి. వాటిని పరిగణనలోకి తీసుకుని ఆమేరకు విత్తనాలు అందిస్తే విత్తనాల కొరత సమస్య తీరిపోతుంది. ప్రభుత్వ అధికారులు, వ్యవసాయ మంత్రిత్వశాఖపై ఆధిపత్యం సాధించే ప్రజాప్రతినిధులు విత్తనాల కొరతే లేదని, సీజన్‌కు సరిపడా విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని ప్రకటించి సంతృప్తి చెందుతున్నారు. అయితే ఈ సమీక్షలకు, ప్రకటనలకు, అధికారులు రూపొందిస్తున్న నివేదిలకు వాస్తవ పరిస్థితులకు ఏమాత్రం పొంతన ఉండటం లేదు. దిగుబడి గణనీయంగా తగ్గుముఖం పడుతుంది. ఈసారి ఎప్పటిలాగే పత్తి, జీలుగు, జనుము, పచ్చిరొట్ట, వడ్ల విత్తనాలు అందడం లేదు. ముఖ్యంగా ప్రభుత్వం సన్న రకం ధాన్యానికి బోనస్ ప్రకటించడంతో ఎక్కువ మంది రైతులు సన్నాల వైపు మొగ్గు చూపుతున్నారు. 5 నుంచి 7 వేల క్వింటాళ్ల సన్నాల వడ్లు అవసరం కాగా ఇప్పటి వరకు కేవలం ఆరు వందల క్వింటాళ్లు మాత్రమే రైతులకు అందాయి. దీనితో ప్రైవేటు వ్యక్తులపై రైతులు ఆధారపడాల్సి వస్తోంది. ఈసారి సీజన్ అత్యధికంగా సన్నాలు సాగుచేసేందుకు రైతులు మొగ్గుచూపుతున్నారు. హైదరాబాద్ శివారులోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో విత్తన మేళా కార్యక్రమం నిర్వహించగా ఏకంగా సుమారు మూడువేల మంది రైతులు హాజరయ్యారు. వాస్తవానికి ప్రతి సంవత్సరం అందులో సగం మంది రైతులు కూడా హాజరయ్యే వారు కాదు, దాదాపు రెట్టింపు సంఖ్యలో రైతులు హాజరై సన్నాల రకం వడ్లు కావాలని వత్తిడి చేశారు. రైతులు ముఖ్యంగా తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్), వరంగల్ సన్నాల కోసం డిమాండ్ చేశారు. ఈసారి తెలంగాణ రాష్ట్రంలో సుమారు 60 లక్షల ఎకరాల్లో పత్తి సాగు అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎకరానికి రెండు ప్యాకెట్ల చొప్పున 1,26 కోట్ల విత్తన ప్యాకెట్లు అవసరం అవుతాయని అంచనా వేస్తున్నారు. అయితే అందులో సగం కూడా సిద్ధం కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదే సమయంలో నకిలీ విత్తనాలు మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నాయి. కొడంగల్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్ ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో నకిలీ విత్తనాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీనితో రైతులు ఏ విత్తనాలు కొనుగోలు చేయాలో తెలియని అయోమయంలో ఉన్నారు. లక్షా 40 వేల క్వింటాళ్ల విత్తనాలు సిద్ధం చేయాల్సి ఉండగా కేవలం 80 వేల క్వింటాళ్ల విత్తనాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. సుమారు లక్షా 25 వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరం కాగా అందులో సగం కూడా రైతులకు అందుబాటులో ఉంచలేకపోయారు. రైతులకు కావాల్సిన విత్తనాలు కాకుండా వేర్వేరు రకాలు అందుబాటులో ఉంచుతున్నారు. దీనితో రైతులు వాటిని కొనుగోలు చేయకుండా వెనుదిరిగి వెళుతున్నారు. ఈ విషయాన్ని గ్రహించని ప్రభుత్వం రైతులకు సరిపడా విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు ప్రచారం చేస్తోంది. విత్తనాలు సమస్య తీరిన తరువాత ఎరువులు, క్రిమిసంహారక మందుల కోసం మళ్లీ రైతులు రోడ్డెక్కి ఉద్యమాలు చేసే పరిస్థితి నెలకొంటుంది. ప్రతి సీజన్‌కు కనీసం నెల రోజులు ముందుగా ప్రణాళికలు సిద్ధం చేసి ఆమేరకు విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు సిద్ధం చేస్తే సమస్య పరిష్కారం అవుతుంది. రైతుల అవసరాలకు అనుగుణంగా మేలైన విత్తనాలు అందిస్తే రైతులకు ప్రయోజనం కలుగుతుంది. ఈసారి వర్షాకాల సీజన్ కొంతముందుగానే వచ్చింది. దీనితో పంటలు త్వరగాసాగు చేసి దిగుబడి రాబట్టాలని రైతులు ఆశతో ఉన్నారు.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



కవర్ స్టోరీ

**వాసిలి సురేష్**

# బడులకు సిద్ధం.. ఫీజుల యుద్ధం!

**వేసవి సెలవుల అనంతరం జూన్ 12న స్కూళ్లు తెరుచుకొంటున్నాయి. నూతన విద్యా సంవత్సరం 2024-25లో విద్యార్థులు సంతోషంగా అడుగు పెడుతున్నారు. వేసవి సెలవుల్లో సెల్‌ఫోన్, గేమ్‌లు, మైదానాల్లో పరుగులు, వేసవి శిక్షణ శిబిరాల్లో బిజీగా గడిపిన పిల్లలను మళ్లీ స్కూళ్లకు పంపేందుకు తల్లిదండ్రులు సిద్ధమవుతున్నారు.**

ఉత్సాహంగా, రెట్టింపు ఆసక్తితో పిల్లలు పాఠశాలలకు వెళ్లేలా మానసికంగా సిద్ధం చేస్తున్నారు. మొదటి రోజే ఎలాగైనా స్కూలుకు వెళ్లాలని సూచిస్తున్నారు. అదే ఉత్సాహాన్ని సంవత్సరమంతా కొనసాగించాలని కోరుకొంటున్నారు. పిల్లల్లో ఉత్సాహం నింపేందుకు చాలామంది తల్లిదండ్రులు కొత్త బ్యాగ్, లంచ్ బాక్సులు, వాటర్ బాటిళ్లు ఇప్పిస్తూ పిల్లలను ప్రోత్సహిస్తున్నారు.

వేసవి సెలవుల తర్వాత స్కూళ్లు పునః ప్రారంభం అవుతాయంటే స్కూలుకెళ్లే చిన్నారుల్లో సాధారణంగా ఉత్సాహం కనిపిస్తుంది. కారణం పై తరగతులకు వెళ్తున్నప్పుడు స్కూల్ యూనిఫాం దగ్గర్నుంచి పుస్తకాల దాకా అన్నీ కొత్త వస్తువులు కొనిస్తారనే ఆనందమే వారిలో ఎక్కువగా ఉంటుంది. అయితే ఈ క్రమంలో స్కూల్ బ్యాగ్, లంచ్ బాక్సులు, పుస్తకాలు, నోట్‌బుక్స్ వంటివి కొనిచ్చేటప్పుడు తల్లిదండ్రులు పిల్లలను తీసుకెళ్లి వారికి నచ్చినవి కొనివ్వడం మంచిది. దీని ద్వారా వారిలో కొత్త ఉత్సాహం కలగడంతో పాటు ఏ వస్తువు ఎలా కొనాలన్న విషయమూ చిన్నతనం నుంచే అలవడుతుంది.

ఇలా తమకు నచ్చిన వస్తువులతో ఇష్టపూర్వకంగా స్కూలుకెళ్లడం, వాటిని తమ తోటి స్నేహితులకు చూపిస్తూ ఆనందపడడం, ఆ తర్వాత ఇంటికొచ్చి ఆ ఆనందాన్ని, స్నేహితుల ప్రతిస్పందన మరెంతో సంతోషంగా తల్లిదండ్రులతో పంచుకోవడం జరుగుతుంది. దీంతో తల్లిదండ్రులకు సంతృప్తి కలుగుతుంది.

స్కూల్ ప్రారంభమవుతుందంటే కేవలం వారికి సంబంధించిన యూనిఫాం, పుస్తకాల పైనే కాదు. వారి గది కూడా సక్రమంగా ఉండేలా చూడాలి. అప్పటిదాకా సెలవులంటూ చిందరవందరగా పడేసిన వస్తువులు, బట్టలతో వారి గది గందరగోళంగా ఉంటుంది. కాబట్టి పిల్లల గదిని చక్కగా సర్దుతూ, ఆ పనిలో వారిని భాగం చేయడం మంచిది. ఈ క్రమంలో పాత పుస్తకాలు తీసేసి, వాటి స్థానంలో కొత్త పుస్తకాలను సర్దడం, స్కూల్‌బ్యాగు, వాటర్ బాటిల్ వంటి వస్తువులన్నీ పిల్లలు ఎక్కడెక్కడ పెట్టుకోవాలో తెలియజేయాలి. రోజూ అక్కడే పెట్టమని చెప్పడం, వారికి కొనిచ్చిన కొత్త బట్టల్ని అల్మరాల్లో చక్కగా సర్దడం, డ్రస్సులు,

ఇంట్లో వేసుకొనే బట్టలు వంటి వాటన్నిటికీ ఒక చోటు నిర్దేశించి, వాటిని ఒక క్రమ పద్ధతిలో అమర్చడం వంటివన్నీ వారికి నేర్పించాలి. ఇలా చేయడం వల్ల వారి గదిని ఎలా చక్కగా పెట్టుకోవాలి, ఎలా సర్దుకోవాలి వంటి విషయాలు వారికి అర్థమవుతాయి.

వేసవి సెలవుల్లో పిల్లలు ఇష్టమొచ్చిన సమయానికి పడుకొని, ఉదయం కాస్త ఆలస్యంగా నిద్ర లేవడానికి అలవాటు పడతారు. స్కూల్ తెరిచిన తర్వాత కూడా ఇదే పద్ధతిని కొనసాగిస్తే స్కూలుకు ఆలస్యమవడంతో పాటు స్కూల్లో బద్ధకించే అవకాశం ఉంది.

స్కూలంటే ఇష్టమున్న పిల్లలు కూడా అప్పుడే స్కూల్ మొదలయిందా? ఇంకొన్ని రోజులు సెలవులుంటే బాగుండేదని అనుకుంటారు. ఇటువంటి ఆలోచనలు మనసులోకి రాకుండా వారిని ముందు నుంచే స్కూలుకి సన్నద్ధం చేయాలి. స్కూల్స్ ప్రారంభం కావడానికి రెండు మూడు రోజుల ముందు నుంచే పిల్లలచే పక్కా ప్రణాళిక పాటించేలా చూడాలి. రాత్రుళ్లు టీవీలు, మొబైల్స్ వంటి అన్నీ ఆఫ్ చేయడం, వారు త్వరగా నిద్రపోయేలా చేయడం, ఉదయాన్నే త్వరగా నిద్ర లేపడం వంటివి చేయాలి.

అలాగే సెలవుల్లో వారు కాలంతో పని లేకుండా ఇష్టమొచ్చిన సమయానికి, ఎరికి నచ్చిన ఆహారం తినడానికి అలవాటు పడి ఉంటారు. అందుకని స్కూలు సమయాలకు తగినట్లుగా పొద్దున్నే బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్ వంటివి అలవాటు చేయాలి. తద్వారా రాత్రుళ్లు డిన్నర్ కూడా సరైన సమయానికి చేసే అవకాశముంటుంది. ఇలా చేయడం వల్ల నిద్ర, ఆహారం సమతుల్యంగా ఉండి స్కూలుకెళ్లినా వారు నిరుత్సాహపడకుండా ఉండేలా చేయవచ్చు.



## చిన్నప్పటి నుంచి చదివే అలవాటు పెంపొందించాలి..

3-4 తరగతుల నుంచి పిల్లలు ప్రతిరోజూ స్థిరంగా కూర్చొని తమంతట తాముగా పాఠ్యాంశాలను కనీసం ఒక గంట పాటు చదువుకునేలా అలవాటు చేయాలి. ఈ క్రమంలో తల్లిదండ్రులు పిల్లలకు అవసరమైన సలహాలు, సూచనలు, అర్థంకాని విషయాలు వంటివి చెప్పాలి. అంతేకానీ వారి హోంవర్క్ మీరే చేయడం మంచిది కాదు. ఇలా రోజూ ఓ గంటపాటు పాఠ్యాంశాల్ని అర్థం చేసుకుంటూ చదివితే అది వారికి ముందుముందు ఎంతో ఉపయోగపడుతుంది.

## సరైన ఆహారం తీసుకోవాలి

ఎదిగే పిల్లలకు లంచ్ బాక్సుల్లో చక్కటి పోషకాహారాన్ని, వాళ్ల ఇష్టంగా తినేలా రుచికరంగా అందివ్వడం మంచిది. ఈ క్రమంలో పప్పు, క్యారెట్లు, బఠానీలు, బీన్స్ వంటి వాటితో చేసిన కిచిడీ, పండ్లు వంటివి అలవాటు చేస్తే వారికి కావాల్సిన పోషకాలు అందుతాయి.



## విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలకు పరిష్కారం చూపాలి

స్కూలుకెళ్లడానికి ముందు రోజు రాత్రే పిల్లలు తమ బ్యాగ్ సర్దుకుని, రేపు వేసుకునే బట్టలు రెడీగా పెట్టుకొని ఉండేలా వారితో రోజూ అలవాటు చేయించాలి. కొందరు పిల్లలు ఎన్ని చేసినా బడికెళ్లడానికి కడుపునొప్పి, తలనొప్పి అంటూ సాకులు చెబుతుంటారు. అన్ని సమయాల్లోనూ వాళ్ల చెప్పేది నిజం కాకపోవచ్చు. పిల్లలు ఇలా చెబుతున్నారంటే అందుకు వారు బడిలో ఏదో ఒక సమస్య ఎదుర్కొంటున్నారని గుర్తించాలి.



అదేంటో వారినే నెమ్మదిగా అడిగి తెలుసుకొనే ప్రయత్నం చేయాలి. అంతేకాదు.. అది నిజంగా సమస్యే అయితే దాన్ని స్కూల్ టీచర్ల సహాయంతో అధిగమించేందుకు ప్రయత్నిస్తే స్కూల్లో పిల్లల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుంది. తద్వారా చిన్నారులు ఇష్టపూర్వకంగా స్కూలుకెళ్లగలుగుతారు. స్కూలు నుంచి ఇంటికి తిరిగి రాగానే పిల్లలు చేయాల్సిన పనులు, హోంవర్క్, పాఠ్యాంశాలు చదువుకోవడం, ఇతర వ్యాపకాలు నేర్చుకోవడం.. వంటి అంశాలన్నింటికీ సంబంధించిన టైం టేబుల్ని ముందుగానే వేసి వారితో అలవాటు చేయించాలి. అలాగే బడికెళ్లే సమయంలో, పాఠాలు నేర్చుకునే సమయంలో పిల్లలు ఒత్తిడికి గురవుతున్నారన్న అనే అనుమానం మీకు వచ్చినట్లయితే ఒకటి రెండు వారాల్లోపే ఆ సమస్యల్ని పరిష్కరించుకోవాలి. ఈ క్రమంలో స్కూలుకెళ్లి పిల్లలకున్న అనుమానాలు, ఆందోళనల గురించి మాట్లాడితే మంచిది. దీనివల్ల టీచర్ల నుంచి భరోసా అందుతుంది.

## క్రమశిక్షణ, మంచి అలవాట్లు పెంపొందించాలి

ఇప్పటివరకూ పిల్లలు వేసవి తాపాన్ని తగ్గించుకునేందుకు ఇంట్లోనే ఉంటూ హాయిగా గడిపేశారు. అమ్మమ్మలు, నానమ్మలు, బంధువుల ఇళ్లకు, వెకేషన్లు అంటూ అంతా తిరిగేశారు. ఇక బడికి వెళ్లే సమయం వచ్చింది. కానీ ఇంత కాలం సంతోషంగా గడిపిన పిల్లలు మళ్లీ బడికి వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడుతుంటారు. వేసవిలో ఆలస్యంగా నిద్ర లేవడం, ఇష్టం వచ్చిన చోట్లకు వెళ్లడం, తినడం, తిరగడం చేసుంటారు. ఇప్పుడు పొద్దున్నే లేచి బడికెళ్లు, చదువుకో.. అంటే అలవాటు పడేందుకు ఇబ్బంది పడతారు. తల్లిదండ్రులు కూడా కాస్త టెన్షన్ పెట్టేస్తుంటారు. అయితే పిల్లలు చక్కగా బడికి అలవాటవ్వాలంటే తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలి. పిల్లలు బడికి అలవాటు అవ్వాలంటే ముందు టైం సెట్ చేయాలి. నిద్ర లేవడం, రెడీ అవ్వడం, ఆడుకోవడం, హోం వర్క్ చేయడం, కుటుంబ సభ్యుల కోసం కాస్త సమయం.. ఇలా వాళ్ల చేసే కార్యకలాపాలన్నింటికీ టైం కేటాయిస్తూ టైం టేబుల్ సెట్ సెట్ చేయాలి. ఇలా చేస్తే దాన్ని చూసి ఫాలో అయిపోతూ త్వరగా బడికి అలవాటు పడిపోతారు. ఒక నెల రోజులు ఫిక్స్‌డ్ టైం టేబుల్ వుంటే చాలా మంచిది.



పిల్లలు చేయాల్సిన పనుల జాబితాను తయారు చేయడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయి. పుస్తకాలు, నోట్ బుక్‌లు.. ఇలా ఇంటికి తీసుకు రావాల్సిన ప్రతిదాని గురించి రాయమని చెప్పాలి. ఈ జాబితా పిల్లలు పాఠశాలకు వెళ్లేందుకు రోజూ తీసుకెళ్లాల్సిన ప్రతిదాన్ని గుర్తు చేయడంలో ఉపయోగపడుతుంది. ఇలా చేయడం వల్ల పిల్లలు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడానికి వీలుంటుంది. పిల్లలకు ఏమి కావాలో వాళ్లనే సెలెక్ట్ చేసుకోనివ్వాలి. పిల్లలకు అవసరమైన పాఠశాల సామాగ్రి, పుస్తకాలు, బూట్లు, యూనిఫారాల జాబితాలను ముందుగానే రూపొందించుకోవాలి. పిల్లలతో సహా షాపింగ్ వెళ్లి వారికేం కావాలో వారినే సెలెక్ట్ చేసుకోనివ్వాలి. బడికి వెళ్లేకంటే ముందు అంటే ఉదయం, బడి నుంచి తిరిగి వచ్చాక ఖాళీ సమయాల్లో వారేం చేయాలనుకుంటున్నారో ముందుగా వారినే అడగాలి. ఆటలు, పాటలు, డ్యాన్సులు, ఏమైనా సంగీత వాయిద్యాలు వాయించడాన్ని ఇష్టపడితే ఆయా తరగతుల్లో చేర్పించడం చాలా ముఖ్యం. ఆరోగ్యకరమైన ఆహారం అధిక ప్రొటీన్ కలిగిన అల్పాహారం ఇచ్చి పిల్లలను బడికి పంపాలి. అది వారి శారీరక, మానసిక బలాన్ని మరింత పెంపొందిస్తుంది. వారు ఇష్టంగా తినే ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందజేయాలి. కొత్త విద్యా సంవత్సరానికి పిల్లలను అలవాటు చేయడం కాస్త కష్టమే అయినప్పటికీ పైన చెప్పినవన్నీ పాటిస్తే త్వరగా అలవాటు పడిపోతారు. అలాగే స్కూల్లో వారు సాధించిన విజయాలను సెలబ్రేట్ చేస్తే వారిలో ఆత్మవిశ్వాసం మరింతగా పెరుగుతుంది.

పిల్లల చదువు కోసం తల్లిదండ్రులు చేపట్టాల్సిన చర్యలు

తల్లిదండ్రులు తమ పిల్లలకు పాఠ్యాంశాలతో పాటు ఇతర విషయాల గురించి అర్థమయ్యేలా చెప్పాల్సిన అవసరం ఉంది. సమాజం పట్ల అవగాహనను కల్పించాలి. పాఠ్య పుస్తకాలతో పాటుగా ఇతర పుస్తకాలను చదివే అలవాటు చేయాలి. పిల్లల సమగ్ర అభివృద్ధికి దోహదపడే పుస్తక పఠనం అలవాటు చిన్నప్పటి నుంచి పెంపొందించాలి. కొత్త ప్రదేశాలకు తీసుకు వెళ్లటం వల్ల వారి ఆలోచనా పరిధి పెరుగుతుంది. పిల్లలు చదువులో ప్రతిభ చూపినప్పుడు పెద్దలు వారిని ప్రోత్సహించాలి. అప్పుడే వారి శక్తి సామర్థ్యాలు మరింత పెరుగుతాయి. పిల్లల్లో కలిగే సందేహాలను ఎరికి అర్థమయ్యే భాషలో వివరించాలి. అలా కాకుండా విసుక్కోవడం చేయరాదు. అలా చేస్తే పిల్లల ఆలోచన, ఆసక్తి తగ్గుతాయి. పిల్లల చదువుల విషయంలో కొంత మంది తల్లిదండ్రులు అతిగా జోక్యం చేసుకుంటూ ఉంటారు. మరికొంతమంది అస్సలు పట్టించుకోరు. ఈ రెండు పద్ధతులూ మంచివి కావు. విద్య విషయంలో ఒకవైపు పిల్లల్ని ప్రోత్సహిస్తూనే, వారి అభిరుచికి ప్రాధాన్యత ఇవ్వాలి. పిల్లలు తమ అభిరుచికి, అభ్యసన స్థాయికి తగిన చదువుల్లో ముందుకు సాగేలా పెద్దలు ప్రోత్సహించటంతో పాటు అందుకు తగిన వాతావరణాన్ని ఇంట్లో ఉండేలా చూడాలి. పిల్లల చదువుల విషయంలో వారి శక్తి సామర్థ్యాలను మించిన ఫలితాలను ఆశించటం ఏమాత్రం తగదు. ఏదైనా సమస్య ఉత్పన్నం అయిన సందర్భంలో పిల్లల కోణం ఆలోచించే ప్రయత్నం చేయాలి. తల్లిదండ్రులు అప్పుడప్పుడు పాఠశాలకు వెళ్లి, ఉపాధ్యాయులను కలసి పిల్లల చదువుల గురించి, నడవడిక గురించి తెలుసుకోవాలి. పిల్లలు చదువులో వెనుకబడి ఉంటే అందుకు గల కారణాలు అవగాహన చేసుకుని వారిని చదువులో ప్రోత్సహించేలా అదనపు శిక్షణని ఇవ్వాలి. పిల్లలు, ఒత్తిడి, ఆందోళనకు గురి కాకుండా చూడాలి. చదువు విషయంలో పిల్లలను తోటి విద్యార్థులతో పోల్చి కించపరచరాదు. వారికి సానుకూలమైన సలహాలు ఇస్తూ ప్రోత్సహించాలి. చదువుతో పాటు ఆటపాటల్లోనూ వారిని ప్రోత్సహించాలి. దీనివల్ల వారికి మంచి ఆరోగ్యం కలుగుతుంది. పిల్లలు రోజూ కొంత సమయాన్ని ఆటలు, వ్యాయామానికి కేటాయించేలా చూడాలి.





పిల్లల్లో ఆరోగ్య సమస్యలు గుర్తిస్తే వెంటనే వైద్యుల వద్దకు తీసుకువెళ్లి చికిత్స అందించాలి.

### ప్రభుత్వ స్కూళ్లల్లో మౌలిక వసతులు కల్పన

రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వ స్కూళ్ల అభివృద్ధికి నిధులు కేటాయించి కార్పొరేట్‌కు దీటుగా సర్కారు బడులను తీర్చిదిద్దుతున్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మౌలిక వసతులు కల్పిస్తున్నారు. ప్రతి విద్యార్థికి మెరుగైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యంగా పని చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 'నాడు-నేడు' పేరుతో, తెలంగాణ రాష్ట్రంలో 'మన ఊరు మన బడి' పేరుతో ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక వసతులు కల్పన చేయటం జరుగుతున్నది. గ్రామాల్లో పేదలు, మధ్య తరగతివారు స్థాయిని మించి పిల్లల విద్య కోసం కార్పొరేట్ పాఠశాలలకు లక్షల్లో ఫీజులు కట్టి అప్పుల పాలవుతున్నారు. ఆ బాధలు తొలగించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించి కార్పొరేట్ స్థాయిలో ఉచితంగా విద్యను అందించేందుకు చర్యలు చేపడుతున్నాయి. అందుకే ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి. 2024-25 విద్యా సంవత్సరం జూన్ 12వ తేదీ నుంచి ప్రారంభించనున్న దృష్ట్యా బడులు ప్రారంభం అయ్యేలోగా రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పనులను వేగవంతం చేస్తున్నాయి. పాఠశాలల్లో ఎలక్ట్రీషియన్, కూలిన గోడలను పునః నిర్మాణం, కూలడానికి సిద్ధంగా ఉన్న పాఠశాలల ప్రహరీ గోడల నిర్మాణం, పెయింటింగ్.. ఇతర మౌలిక సదుపాయాల పనులు వేగవంతంగా జరుగుతున్నాయి.



### ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో ఫీజుల నియంత్రణ జరగాలి

ఫీజుల విషయంలో సరైన నియంత్రణ లేకపోవడం వల్ల పాఠశాలల యాజమాన్యాలు ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. యాజమాన్య ప్రతినిధులు,



ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో కలిసి కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఫీజుల విషయంలో ఈ కమిటీ నిర్ణయం తీసుకోవాలి. అలాంటిది ఏ ఒక్క పాఠశాలలోనూ అమలు కావడం లేదు. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి పేరెంట్స్ కమిటీలను పటిష్టంగా అమలు చేయాలని, ఫీజులు నియంత్రణ కోసం కృషి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



ప్రైవేట్, కార్పొరేట్ విద్యతో పిల్లలకు కష్టాలు

ప్రైవేట్, కార్పొరేట్ రెసిడెన్షియల్ స్కూళ్లు, కాలేజీల్లో పిల్లలకు ఎనిమిది గంటల నిద్ర తప్పనిసరి చేయాలని ప్రభుత్వాలు చెబుతున్నాయి. కానీ కార్పొరేట్ స్కూళ్లలో, కాలేజీల్లో తగినంత నిద్ర పోవడానికి కూడా సమయం ఇవ్వకుండా క్లాసులు పెట్టి విద్యార్థులపై ఒత్తిడి పెంచుతున్నారు. ఇంజినీరింగ్, మెడిసిన్, ఐఐటీలకు తెలుగు రాష్ట్రాల్లో విపరీతమైన ఆసక్తి ఉంది. దీంతో వీటిల్లో ర్యాంకుల కోసం స్కూలు స్థాయి నుంచే ప్రిపరేషన్ మొదలు పెడుతున్నారు. దీంతో స్కూలు స్థాయిలోనే విద్యార్థులకు ఇంటర్ సిలబస్ చెబుతుండటంతో విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. సరిగా నిద్ర పోవడం లేదు. ఆటవిడుపు కరువై మానసికంగా కుంగిపోతున్నారు. టీనేజర్లకు రోజుకు 9 నుంచి 10 గంటల నిద్ర అవసరమని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఆ వయసులో వారు కీలకమైన అభివృద్ధి దశలో ఉంటారు, మెదడు, శరీరం అనేక మార్పులకు లోనవుతాయి. సరైన నిద్ర లేకపోతే డిప్రెషన్‌కు లోనవుతారు. అంతేగాక చెడు వ్యసనాల దారి పట్టవచ్చు. ప్రైవేట్ కాలేజీల విధానాల నియంత్రణ చేయలేని స్థితిలో ప్రభుత్వాలు ఉన్నాయి.

15-17 యేళ్ల పిల్లలు రోజంతా చదువుతూ, తక్కువ నిద్రపోతే వారు విపరీతమైన ఒత్తిళ్లను ఎదుర్కోవలసి ఉంటుందని విద్యా సంస్థలు, తల్లిదండ్రులు గమనించాలి. కార్పొరేట్ కాలేజీలు, స్కూళ్లను నియంత్రించడానికి తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు అవసరమైన, ప్రధానమైన నిర్ణయాలు తీసుకోవడం లేదు. దీనికోసం మొదట ప్రభుత్వ కాలేజీలను, స్కూళ్లను అభివృద్ధి చేసి, గుణాత్మకమైన విద్యను అందిస్తే కార్పొరేట్ కాలేజీల హవా తగ్గే అవకాశం ఉంది.

సీట్లు, ర్యాంకుల గురించి కార్పొరేట్ కాలేజీలు, స్కూళ్లు తప్పుడు ప్రచారం చేస్తున్నాయి. తల్లిదండ్రులకు కాలేజీ యాజమాన్యాలు ఏం చేస్తున్నాయో తెలియడం లేదు. విద్యార్థులపై తీవ్రమైన ఒత్తిడి ఉంటోంది. దానివల్ల వారి మానసిక వికాసం దెబ్బ తింటున్నది. కాలేజీల మొత్తం విధానాల్లో మార్పులు వస్తే తప్ప సమస్య పరిష్కారం కాదు. ఐఐటీ లాంటి సంస్థల్లో రాష్ట్రాల వారీగా కోటా లేదు. రాష్ట్రాల జనాభా ప్రకారం కోటాలు ఉంటే మన తెలుగు రాష్ట్రాల్లో విపరీతమైన డిమాండ్ కొంత తగ్గుతుంది. ఇప్పుడు ఐఐటీల్లో 50 శాతం మన తెలుగు రాష్ట్రాల విద్యార్థులే ఉంటున్నారు. అందువల్ల ఆరో తరగతి నుంచి ఐఐటీ కోచింగ్, కొన్ని చోట్ల యూకేజీ నుంచే ఐఐటీ కోచింగ్ అని బోర్డులు పెడుతున్నారు. ఏడు, ఎనిమిది గంటల పని తరువాత ఎవరికైనా విశ్రాంతి కావాలి. అంతకుమించి చదువు చెబితే విద్యార్థులపై ఒత్తిడి పెరుగుతుంది తప్ప ప్రయోజనాలు కలిగే అవకాశం లేదు. నలిగిపోయేంత ఒత్తిడి మంచిది కాదు. పోటీ పరీక్షలు ఉండాలి, కొంతవరకు ఒత్తిడి ఉండాలి, కానీ అవి విద్యార్థుల సంపూర్ణాభివృద్ధిని దెబ్బ తీసేలా ఉండకూడదు. ఇంటర్మీడియట్ లైఫ్ టర్నింగ్ పాయింట్ అనుకోవచ్చు. అంతకుముందు వరకు స్కూలు చదువు వేరు. ఇంటర్మీడియట్ రెండేళ్లలో చాలావరకు భవిష్యత్తు నిర్ణయమైపోతుంది. ఇప్పుడు దాదాపు పోటీ పరీక్షలన్నీ రాష్ట్రస్థాయిలో కాకుండా దేశస్థాయిలో జరుగుతున్నాయి. విపరీతమైన పోటీ ఉన్న మాట వాస్తవం. హైస్కూలు పిల్లల్లాగ నాలుగైదు గంటలు చదివితే పోటీ పడలేరన్న మాట నిజం. ఇంటర్‌లో కొంత ఎక్కువ శ్రద్ధ, ఎక్కువ సమయం వెచ్చించాల్సి ఉంటుంది. కానీ మరీ రోజులు 13-14 గంటలు చదువు ఏ కోణంలోనూ సమర్థనీయం కాదు. కొంత ఒత్తిడి ఉండడం అవసరమే కానీ విద్యార్థులు నలిగిపోయేలా కాదు. కొంతవరకు పోటీతత్వాన్ని ప్రేరేపించి, వారిలో పట్టుదల కలిగేలా చేయాలిగానీ, మానసికంగా కుంగిపోయేంత ఒత్తిడి ఉండకూడదు. ఎనిమిది గంటల విద్య, ఒకటి రెండు గంటలు స్టడీ అవర్స్ పెట్టుకుంటే చాలు. ఎనిమిది గంటలు మించి చదువు చెప్పినా విద్యార్థుల బుర్రల్లోకి ఏమీ ఎక్కదు. 17 ఏళ్ల విద్యార్థులలో హార్మోన్ల ఎదుగుదల ఉంటుంది, వారికి మానసికోల్లాసం కలిగించే ఆటవిడుపు కావాలి. పరీక్షల ముందు నిద్రపోకుండా చదివారంటే అర్థముంది. కానీ ఏడాది పొడవునా చదివితే మానసిక సమస్యలు వస్తాయి. కార్పొరేట్ కాలేజీల్లో వేలకొద్దీ విద్యార్థులు చేరుతారు. అందరికీ ఐఐటీ ర్యాంకులు రావు. ర్యాంకులు రానివారి పరిస్థితి ఏమిటి? వారి మానసిక ఆరోగ్యం ఎలా ఉంటుంది? ఇది ఆలోచించాల్సిన విషయం. రెండేళ్లు నిద్ర లేకుండా చదివేసి, భవిష్యత్తులో మానసిక ఆరోగ్య సమస్యలు కొనితెచ్చుకుంటే అది సరైన విద్య కాదు. ఐఐటీలో సీటు వచ్చేస్తే జీవితానికి శుభంకార్డు పడినట్టు కాదు.




సీటు వచ్చాక, అక్కడ చదవలేక వెనక్కొచ్చిన వారెందరో ఉన్నారు. ఆ తరువాత ఇంకా ఎంతో జీవితం ఉంది. చేయాల్సిన పనులు, నిర్వర్తించాల్సిన బాధ్యతలు ఎన్నో ఉంటాయి. కానీ, ఆ రెండేళ్ల మితిమీరిన చదువు వల్ల భౌతిక, మానసిక ఎదుగుదల దెబ్బతిని, జీవితంలో ఏ నిర్ణయం సరిగ్గా తీసుకోలేక మానసిక సమస్యలు ఎదుర్కొంటూ చాలామంది సతమతమవుతున్నారు. మంచి చదువు ఉండాలి, మంచి సంస్థలో సీటు రావాలి, మంచి ఉద్యోగం రావాలి.. అని కోరుకోవడం తప్పు కాదు. ఆ కోరిక, ఆ పోటీతత్వం కూడా విద్యార్థుల్లో ఉండాలి. అయితే మితిమీరిన శిక్షణ, నిద్ర లేకుండా యేళ్లపాటు చదువు సరైన విధానం కాదు. ఈ కార్పొరేట్ కాలేజీలలో చదువుతున్నవారికి సోషల్ ఇంటెలిజెన్స్, ఎమోషనల్ ఇంటెలిజెన్స్, రాజకీయ జ్ఞానం ఉండటం లేదు. చదువు అంటే సంపూర్ణాభివృద్ధి జరగాలి. కొందరు విద్యార్థులు స్వచ్ఛందంగా, ఇష్టపడే రోజుకు 15-16 గంటలు నిద్రపోకుండా చదువుకుంటారు. కానీ అదే విధానం వేలమంది విద్యార్థులపై రుద్దడం సరికాదు. క్లాసుల్లో విశ్లేషణ తక్కువగా, బట్టీ పట్టే విధానం ఎక్కువగా ఉంటోంది. టీచర్లు టైం టేబిల్ ప్రకారం పాఠం చెప్పుకుంటూ వెళ్లిపోతారు. విద్యార్థుల సందేహాలు తీర్చేందుకు వాళ్లకు సమయం ఉండదు. టీచర్ల పైనా పనిభారం చాలా ఎక్కువగా ఉంటోంది. కొందరు విద్యార్థులు ఇష్టపడి రోజంతా చదువుకుంటారు. అలాంటివారు పది శాతం కూడా ఉండరు. కానీ మిగతా వేల మంది విద్యార్థులు కూడా అలాగే చదవాలని ఒత్తిడి పెడితే, అది వారి మానసిక ఎదుగుదల దిబ్బతింటున్నది. ప్రభుత్వాలు మార్గదర్శకాలను జారీ చేసినా, కాలేజీలు, స్కూళ్లు వాటిని పాటిస్తున్నాయా, లేదా అని పర్యవేక్షించే విధానం లేదు. ఎన్ని మార్పులు తీసుకొచ్చినా ప్రయోజనం ఉండటం లేదు. తల్లిదండ్రుల ఆలోచనల్లో మార్పులు వస్తే తప్ప విద్యార్థులకు ఈ బాధలు తప్పవు. తగినంత నిద్రపోకుండా చదివితే పెద్దగా ప్రయోజనం ఉండదు. టీనేజీలో ఉన్న పిల్లలకు రోజుకు కనీసం 8 గంటల నిద్ర అవసరం. నిద్రపోకుండా చదవడం వలన విద్యార్థులకు కలిగే లాభాల కంటే నష్టాలే అధికం. దీన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యా సంస్థల యాజమాన్యాలు తెలుసుకోవాలి. సరిపడా నిద్ర పోవడం వల్ల నష్టపోతారు. అలసట, నీరసం వారి ఉత్పాదకతను తగ్గించేస్తాయి. ఏకాగ్రతతో చదవలేకపోవడం వల్ల జ్ఞాపకశక్తి తగ్గి, చదివినవి గుర్తుండకపోయే ప్రమాదం ఉంటుంది. రోజూ ఎనిమిది గంటల గాఢ నిద్ర పోయే విద్యార్థులు నిద్రాహారాలు మాని చదివేవారి కన్నా మంచి ఫలితాలను పొందగలరు. ❑



# ఆరోగ్య సేవలు

**మనదేశంలో** ప్రతి ఏడు నిమిషాలకొకరు గర్భాశయ ముఖద్వార కేన్సర్‌తో కన్నుమూస్తున్నారని చెబుతోంది డబ్ల్యూహెచ్‌ఓ. దాన్ని బట్టి పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అందుకోసం వ్యాక్సిన్ అందుబాటులో ఉన్నా..చాలామందికి ఈ సమస్య గురించి అవగాహనే ఉండట్లేదు. మిగతా రాష్ట్రాల్లో పరిస్థితి ఇలా ఉంటే..సిక్కిం మాత్రం మహిళల ఆరోగ్యానికి పెద్ద పీట వేసి ఆ సమస్యను సమూలంగా దూరం చేయాలని ఆరేళ్లక్రితమే ఓ పథకానికి శ్రీకారం చుట్టింది. తొమ్మిది నుంచి పదిహేనేళ్లలోపు ఆడపిల్లలకు హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిలోమా వైరస్) వ్యాక్సిన్‌ను ఉచితంగా వేస్తోంది. దాదాపు ఐదువేల రూపాయల ఖరీదు చేసే ఈ వ్యాక్సిన్‌ను ఆడపిల్లలకు



ఆరునెలల వ్యవధిలో మూడుసార్లు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ వ్యాక్సిన్ గర్భాశయ ముఖద్వార కేన్సర్‌కు కారణమయ్యే వైరస్‌ను దూరం చేసి ఈ సమస్య బారిన పడకుండా చూస్తుంది. ఎంతో కీలకమైన ఈ హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను ఆడపిల్లలకు అందించడానికి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను వేదికగా చేసుకుని ఉచితంగా ఇస్తోంది సిక్కిం ప్రభుత్వం. దాంతోపాటు గర్భాశయ ముఖద్వార కేన్సర్ గురించి అవగాహన కల్పిస్తూనే వ్యక్తిగత పరిశుభ్రతనూ చదువులో భాగం చేశారు. తమ గ్రామంలోని మహిళలకు, చదువులకు దూరమైన ఆడపిల్లలకూ అవగాహన కల్పిస్తే బాధ్యతనూ విద్యార్థినులకు అప్పగించి పల్లెల్లోనూ పెద్ద ఎత్తున ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు టీచర్లు. ఇప్పటి వరకూ దాదాపు వందశాతం వ్యాక్సినేషన్ ప్రక్రియను పూర్తి చేసిన అధికారులు ఇక మీదట తొమ్మిదేళ్లు నిండిన వారికి వేయడానికి సిద్ధమయ్యారు.




## ఇంటికే వైద్యసేవలు

ఇంటిల్లిపాదినీ చూసుకునే మహిళలు తమ గురించి మాత్రం పట్టించుకోరు. ఆరోగ్యం బాగోకపోయినా ఏ పనులూ ఆపకుండా అందరికీ అన్నీ అమర్చి పెడుతుంటారు. అలాంటి మహిళ బాధ్యత మాది అంటూ మూడేళ్ల క్రితం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం 'దాయి-దీదీ (అమ్మ-అక్క) క్లినిక్'లను ప్రవేశపెట్టింది. అందుకోసం కొన్ని బస్సుల్లో పరీక్షలకు కావల్సిన పరికరాలనూ, మందులనూ ఉంచి మొబైల్ ఆసుపత్రులుగా మార్చారు. వాటిలో వైద్యుల నుంచి సహాయకుల వరకూ మహిళలనే నియమించి మురికివాడలకూ, పల్లెలకూ పంపి ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నారు. ఈ మొబైల్ మెడికల్ యూనిట్ల ద్వారా కేన్సర్, గుండె, సంతాన సాఫల్య సమస్యలతోపాటు దాదాపు యాభైరకాల పరీక్షలు చేసి మందులు ఇస్తున్నారు. తీవ్ర సమస్యలున్నవారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారికి ప్రభుత్వాసుపత్రుల్లో ఉచితంగా శస్త్రచికిత్సలూ చేయిస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలూ, అంగన్‌వాడీ సిబ్బంది సహకారంతో వీధివీధినా తిరుగుతూ వైద్యసేవల్ని మహిళ ముంగిట్లోకి తీసుకెళ్లిన ఘనత మాత్రం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికే దక్కుతుంది. అంతేకాదు, ఈ బస్సుల ద్వారా సేవలు అందించడానికి మహిళా సిబ్బందికీ మరిన్ని ఉద్యోగావకాశాల్ని కల్పిస్తోంది ప్రభుత్వం.

## ఇన్సులిన్ కిట్టు ఇస్తూ..

పుట్టుకతోనే ఎందరో చిన్నారులు మధుమేహంతో ఈ భూమ్మీదకొస్తున్నారు. మరికొందరికి ఆ సమస్య తరవాత వచ్చినా తల్లిదండ్రులు సకాలంలో గుర్తించకపోవడంతో తీవ్ర అనారోగ్యం పాలవుతున్నారు. టైప్-1 డయాబెటిస్‌తో బాధపడే వీరికి ఇన్సులిన్ తప్పనిసరి. పైగా అది ఖరీదుతో కూడుకున్నది కూడా కావడంతో కేరళ ప్రభుత్వం 'మిఠాయి క్లినిక్'లను అందుబాటులోకి తీసుకొచ్చి..మధుమేహ చిన్నారుల వైద్య అవసరాలను తీర్చుతోంది. మొదట ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఈ సేవల్ని ప్రారంభించి చిన్నారులకు పరీక్షలు చేసి మధుమేహం ఉన్నవారికి ఇన్సులిన్ కిట్ అందించసాగింది. ఈ కిట్‌లో ఇన్సులిన్ క్యాట్రిడ్జ్‌లు, పెన్, సూదులూ, గ్లూకోమీటర్, రక్తం సేకరించే ప్రత్యేకమైన సూదులు ఉంటాయి. కిట్‌లు అందుకున్న చిన్నారుల గ్లూకోజ్ స్థాయిలను ఎప్పటికప్పుడు వైద్యసిబ్బంది తెలుసుకుంటూ..వారికి తగిన సలహాల గ్లూకోజ్ స్థాయిలను ఎప్పటికప్పుడు వైద్యసిబ్బంది తెలుసుకుంటూ.. వారికి తగిన సలహాలూ, సూచనలూ అదిస్తున్నారు. ఈ మధ్యనే ఆ రాష్ట్ర ప్రభుత్వం కేరళలోని అన్ని జిల్లాల ప్రభుత్వ ఆసుపత్రులకు మిఠాయి సేవల్ని విస్తరించి ఐదేళ్లు నిండిన మధుమేహ బాలలకు అండగా నిలుస్తోంది. ప్రభుత్వస్కూళ్లకూ, మారుమూల పల్లెలకూ వైద్యసిబ్బందిని పంపి ఎప్పటికప్పుడు మధుమేహ బాధితుల్ని గుర్తించి వారికి ఏడాదికి దాదాపు రెండు లక్షల రూపాయల విలువైన వైద్యసాయం అందిస్తోంది.





# వెన్నెల ధారలు

**మౌనంగా** ఉన్న ప్రతిసారి
నిశ్శబ్దం గుర్తు చేస్తుంది
నువ్వు మనిషివి మాటాడు అని..
ఏంటి.. నీలో నువ్వే మాట్లాడుకుంటున్నావు
పదాల ప్రవాహాన్ని జల్లెడ పడుతున్న.
బిడ్డ పెద్దదవుతుంది అవి ఇవి నేర్పించు
నేర్పిస్తున్నాను.
గుడ్ టచ్ బ్యాడ్ టచ్
మొదటి పాఠంగా.
పిచ్చి పట్టిందా
నిద్రపోకుండా
అర్ధరాత్రిదాకా ఆ రాతలు ఏవిటి..
గుండె ఘోషిస్తుంది
ఇలా కలాన్ని పక్కన పెట్టిన ప్రతిసారీ..
ఒకప్పుడు నిప్పు నీరు చీకటి చూసి భయపడేదాన్ని
ఆ స్థానంలో వచ్చి చేరాడు ఇప్పుడు మనిషి.
వాకిట్లో తిప్పుడు ముగ్గును అలవోకగా వేసింది
జీవితంలో అంతకన్నా ఎక్కువగా మలుపులున్నాయి
మంచి ఇల్లాలు అనిపించుకునే క్రమంలో
తాను త్యాగం చేసింది
నిద్రను, నీడను, జీతాన్ని, జీవితాన్ని.

- నల్ల జ్యోత్స్న

## ఈవారం కవిత్వం

### నానీలు

**నేడు అన్నీ**
ఉచితం
ఆర్థికస్థితి
పతనం.

.....

పంటకు
ఎరువు
జ్ఞానానికి
గురువు,

.....

కోరిక వెంట
కోరిక
జీవితానికి
లేదు తీరిక.

.....

నిండుగా
పారితే ఏరు
పచ్చగా
పెరుగును పైరు

.....

విద్యార్థికి
వినయం
వీరుడికి
విజయం.

.....

భక్తంటే
అన్వేషణ
దైవాన్ని
చేర్చు సాధన.

.....

జలంతోనే
జీవనం
జలంతోనే
జగం.

.....

జలమే
జాతికి బలం
నీటిని పొదుపు
చేయాలి మనం.

.....

వాన నీటిని
కాపాడాలి.

- శ్రిష్టి శేషగిరి

# మంచు పర్వతం

**హరిత వనామృత**
నందనంలో
నా కవితకు నాంది పలికిన
వనితానిత జనిత
నీ గుండె చప్పుళ్ల
అణువణువునా
నా హృదయాన్ని
రాగరంజితం చేసినట్లు
నీ పలుకులు మధులతలై
నన్ను బంధిస్తూ
నా తలపులు
నీ వలపు పిలుపులకై
తహతహలాడుతున్నట్లు
నాకు తెలుసు
నీ మనసు
మంచుపర్వతమని
ఆ మంచులో కలకాలం
కరిగిపోవాలని-
ఇలాగే....
నఖశిఖ పర్యంతం
సన్నజాజి తీగలా
నిన్ను
అల్లుకుపోవాలని

- కొరప్రోలు హరనాథ్




## పుస్తక సమీక్ష

## పెద్దలు రాసిన పిల్లల కథలు



'బాల చెలిమి' పిల్లల వికాసానికి తోడ్పడే పత్రిక. చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ సంస్థ వారు నిర్వహిస్తున్నారు. ఏటా పిల్లలు పిల్లల గురించి రాసినవి, పెద్దలు పిల్లల నుద్దేశిస్తూ రాసినవి కథల పోటీలు నిర్వహిస్తూ, ప్రకటిస్తున్నారు. బాలలలో సృజనాత్మకశక్తిని పెంపొందించటానికి వారిలో మంచి ఆలోచనలు పెంపొందించటానికి మొదటి రకం పోటీలు ఉపయోగపడతాయి. వారిలో సాహిత్యం పట్ల అభిరుచి పెరుగుతుంది. పెద్దలు రాసిన పిల్లల కథలవల్ల పిల్లల్లో మంచి నడత పెంపు అవుతుంది. ఈ అకాడమీవారు తెలుగు రాష్ట్రాలలో 'పర్యావరణ కథల పోటీలు- 2023' నిర్వహించి వచ్చిన కథలను విడతలవారీగా వడపోసి అందిస్తున్న 47కథల పుస్తకం ఇది. నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న పెద్ద సమస్య పర్యావరణ పరిరక్షణ. మొదటి విడతగా 112 కథల్లోంచి 47 కథలను ఎంపిక చేసి ప్రకటించారు. భూమిని, చెట్టూ చేమా, పర్యావరణం, గాలి, నీరు అడవులను రక్షించాలన్న సందేశం ఈ కథల్లో కనిపిస్తుంది. నేటి బాలలే రేపటి పౌరులు. రేపటిపౌరులను నేడే ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలన్న ప్రయత్నంలో భాగంగా ఈ కథలను ప్రకటించటం ముదావహం. అకాడమీ నిర్వాహకులు మణికొండ వేదకుమార్ అభినందనలు. మంచి నాణ్యత, బొమ్మలు సందేశం అన్న ఈ కథాసంపుటి ప్రతి ఇంటా, గ్రంథాలయాల్లో ఉండదగిన పుస్తకం. **(బాలచెలిమి, పర్యావరణ కథల పోటీలు-2023, సంపాదకులు: మణికొండ వేదకుమార్, వెల: రూ 100, ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్)** **– కూర చిదంబరం**

## 'తెలంగాణ మన్ను కథలు'



ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో 1968-69, 2009-2014లలో అసువులు బాసిన తెలంగాణ మృతవీరులకు అంకితంగా ఈ పుస్తకం తెచ్చారు రచయిత. దాదాపు 2వేలు దాకా కథలు రాసిన మల్లయ్య మట్టికథల పేరుతో ప్రజాతంత్ర పత్రికలో ప్రచురణైన కథలే!! కాసుల ప్రతాపరెడ్డి చక్కటి ముందు మాట రాసారు. 56 కథలున్నాయి ఈ సంపుటిలో సాంఘిక జీవనశైలి సామాన్యుల రోజు వారి జీవన చిత్రణే ఈ కథలకు ప్రాణం. అమెరికా హౌజ్‌నో హిస్టరీ-బట్ బ్యూటిఫుల్ జాగ్రఫీ అంటారు చాలామంది. మనకు అద్భుత సాహిత్య సంపద, సంస్కృతి, చరిత్ర ఉన్నాయి. 'దేశమంటే మట్టికాదు' (పేజీ: 15) రామారావు, శాస్త్రి అయిలయ్యల సంభాషణలు తెలంగాణ ప్రాశస్త్యం తెలిసేలా ఉన్నాయి. బివాండి, షోలాపూర్, చందా, బళ్ళార్సా, బొంబై లాంటి ప్రాంతాలకెంతో మంది వలసలు వెళ్లేస్థితికి కారణాలు చూడాలని తెలంగాణ వివక్షతను చెప్పారు అయిలయ్యపాత్ర ద్వారా. 'దొర' (పేజీ.17) దొర కళ్లన్నీ ఆడవాళ్ల పైనే అతని కన్నుపడ్డ స్త్రీశీలం పలహారమే. పెద్ద మనిషయిన స్త్రీ మొదట దొరగడికే పోవాలి. దొరంటే దౌర్జన్యం. రాష్ట్రాల ఏర్పాటు పై చర్చించడంతో ఒక చోట అలా అన్నారు. 'నాయకత్వం అగ్రకులాల వారిది కార్యకర్తలంతా దళితులు. గిరిజనులు కావడం ఒకటి ఒక అంబేద్కర్‌లా ఒక లెనిన్‌లా పీడిత కులాల నుంచి ఎదిగిన నాయకులుగా వస్తే ఇలా ఉండేది కాదేమో? (పేజీ.218), **(తెలంగాణ మన్ను కథలు', రచన: కాలువ మల్లయ్య, వెల: రూ 250, ప్రతులకు: అన్ని ప్రముఖ బుక్‌హౌస్‌లు)** **– తంగిరాల చక్రవర్తి**

## సుదీర్ఘ స్వప్నం-గోవింద్



మహాత్ముడు మళ్లీ ప్రత్యక్షమై తెలుగు ప్రాంతాలలో సంచరిస్తే అనే ఆలోచనల ఊహాగానాల నవల మూరిశెట్టి గోవింద్ 'సుదీర్ఘ స్వప్నం' ఆసక్తికరంగా చదివింపచేస్తోంది. బాపూజీ జీవిత కాలంలోని సంఘటనలను గుర్తుచేస్తూ, ప్రస్తుత సమాజ పతనాన్ని ఈ నవల సూచిస్తోంది. అవినీతి, మద్యపానం, దుష్పరి పాలన, పేదరికం, అంటరానితనం వంటి సామాజిక రుగ్మతలపై ప్రస్తుతకాలంలోని స్థితిగతులు ఈ నవల విమర్శనాత్మకంగా విశ్లేషించింది. గాంధీజీ హత్య సందర్భాన్ని ఆయన నోటి మాటలలో వివరిస్తుంది. స్వాతంత్ర్యానంతరం, భారత ప్రభుత్వ తీరుతెన్నులు సజావుగా లేవని గాంధీజీ ఆవేదన, ఈ నవలలో స్పష్టమౌతోంది. 'ఊరూరా నా విగ్రహాలెందుకు? సత్యం, అహింసపాటిస్తే నేను సంతోషిస్తాను' గాంధీజీ పోలికలు వున్న వ్యక్తి దేశసంచారం, గాంధీజీ మీదనే దేశద్రోహనేరం మోపడం నవల కథాంశాలు రక్తికట్టిస్తాయి. నవల ముగింపులో గాంధీజీ ప్రసంగస్ఫూర్తితో రామరాజ్యం ఏర్పడినట్టు, ఆఖరున తెలుసుకొన్న నిజం మానవ మనుగడ ఈ భూమ్మీద ఉన్నంత వరకూ, గాంధీ ప్రతిపాదించిన సత్యం, అహింసే మానవాళికి శరణ్యం అంటారు. గాంధీజీని స్వర్గం నుంచి రప్పించి భూమిపై అవతరింప చేసిన గోవింద్ సృజనాత్మక కల్పనా చమత్కృతి అభినందనీయం. **(సుదీర్ఘ స్వప్నం, రచన: మూరిశెట్టి గోవింద్, వెల: రూ 200, ప్రతులకు: ఎం.గోవింద్, సి.డి.కండ్రిగ, కార్వేటి నగరం మండలం, చిత్తూరుజిల్లా)** **– యర్రమిల్లి**

## సామాజిక నిశిత పరిశీలనే కరిపె కవిత్వం



దశాబ్దకాలంగా కవిత్వంతో మమేకమైన కవి కరిపె రాజ్ కుమార్ 63 కవితలతో తాజాగా వెలువరించిన నాలుగవ పొత్తం 'ఆజాదీ'. కవికి స్త్రీల పట్ల అమితమైన గౌరవం, ఆరాధన. స్త్రీ, పురుషుల మధ్యగల కృత్రిమ అంతరాన్ని తీవ్రంగా నిరసిస్తాడు. స్త్రీని అశక్తురాలిగా చిత్రిస్తున్న పురుషాహంకారాన్ని, ఆధిపత్యాన్ని ప్రశ్నిస్తాడు. 'పురుటి నొప్పులు అనుభవించని/ పుణ్య పురుషులు/ పున్నమనరక ప్రవాహపు/ గజ ఈతగాండ్లు'గా మృగాళ్లను సంభోదిస్తాడు రాజ్‌కుమార్. 'ఆమెను చదవడమంటే/ ఆమెను సృష్టించిన అతనితో/ తీయని స్నేహం చేయడమే! ఆ సృష్టికర్తతో నేరుగా సంభావించడమే' అనడంలో కవి చిత్తశుద్ధి విశదమవుతుంది.'పదవీ విరమణ ఎరుగని పాంథుడు/ వ్యవసాయాన్ని వ్యసనంగా భావించి/ విజయ గాథల్ని విరివిగా లిఖిస్తాడు' అంటూ రైతన్న శ్రమశక్తిని ఆవిష్కరిస్తాడు. 'దొంగతనాలు చేస్తారు కాబట్టి/ పనిదొరకదేమో?/ పని దొరకదు కాబట్టి/ దొంగతనాలకు ఒడిగడతారేమో?' దొంగలు ఆయన కవితా వస్తువు. ఆదివాసీలు, హనీట్రాప్ బాధితులు, ఆడతనం ఆవహించే పురుషపుంగవులు యిలా..ఎవరు స్పృశించని వస్తువులు ఆయన కవితలవుతై. సామాజిక పరిస్థితుల పట్ల, పరిణామాల పట్ల రాజ్‌కుమార్ నిశిత పరిశీలన ఈ సంపుటిలో ప్రస్ఫుటంగా గోచరిస్తుంది. **(ఆజాదీ, రచన: కరిపె రాజ్‌కుమార్, వెల: రూ 150, ప్రతులకు: నవతెలంగాణబుక్‌హౌస్)** **– రమణ వెలమకన్ని**



# నయా మాయా దర్పణం

**మీరు** ఓ మాయ దర్పణాన్ని చూస్తున్నారని ఊహించుకోండి. అందులో ఎక్కడోదూరంగా ఉన్న తండ్రి ప్రత్యక్షమయ్యారు. ఆయనను ఆ గదిలోనే నిజంగా చూస్తున్నట్టే అనిపించింది. కళ్లలోకి నీళ్ల పెట్టి చూస్తూ, హావభావాలను ఒలకబోస్తూ ఆయన మాట్లాడుతుంటే ఎంత సంతోషం కలిగిందో.

ఊహించుకోవటానికే అద్భుతంగా ఉంది కదా. అదే నిజమైతే? గూగుల్ చేపట్టిన స్టార్‌లైన్ ప్రాజెక్టు మూలంగా ఇది త్వరలోనే సాకారం కానుంది. సైన్స్ ఫిక్షన్ కథలాంటి ఈ వినూత్న ఆలోచనను సుసాధ్యం చేయనుంది. త్రీడీ, హోల్‌గ్రాఫిక్ మాదిరి డిస్‌ప్లే పరిజ్ఞానంతో కూడిన స్టార్‌లైన్ ప్రాజెక్టు మీద గూగుల్ ఐదేళ్లుగా ప్రయోగాలు చేస్తోంది. అప్పటి నుంచీ మెరుగులు దిద్దుతూ వస్తోంది. మరో ఐదారు నెలల్లో ఇది అందుబాటులోకి వచ్చే అవకాశముంది.

వీడియో సంభాషణలు, వర్చువల్ సమావేశాలు ఇప్పుడు సర్వసాధారణమైపోయాయి. ఆఫీసు బృంద చర్చలనూ వీటితో కొనసాగించటం చూస్తున్నాం. ఇంటి నుంచే ఉద్యోగాలు చేసే ధోరణితో పాటు వివిధ దేశాల్లో వ్యాపార కార్యకలాపాలు నిర్వహించటం పెరిగిపోయిన నేపథ్యంలో వర్చువల్ కమ్యూనికేషన్‌కు ప్రాధాన్యం పెరిగిపోతోంది. జూమ్, గూగుల్ మీట్ వంటి సాధనాలు ఎంతగా ఆదరణ పొందుతున్నాయో చూస్తూనే ఉన్నాం. అయితే ఇవేవీ మనుషులను నేరుగా కలిసి మాట్లాడుకుంటున్న అనుభూతిని ఇవ్వలేవు. ఏదో వీడియోలో చూసుకుంటూ అభిప్రాయాలు కలబోసుకుంటున్నట్టుగా తోస్తుంది గానీ ప్రత్యక్ష సంభాషణ జరుపుతున్నట్టు అనిపించదు. ఇలాంటి ఇబ్బందిని తొలగించే ఉద్దేశంతోనే గూగుల్ సంస్థ వినూత్నమైన ప్రాజెక్టు స్టార్‌లైన్‌కు శ్రీకారం చుట్టింది. అవటానికి వీడియో కాన్ఫరెన్సింగ్ సిస్టమేగానీ నేరుగా మనిషిని చూస్తున్న అనుభూతిని కల్పించటం దీని ప్రత్యేకత.




### వినూత్న పరిజ్ఞానం

స్టార్‌లైన్‌ను ఒకరకంగా 3డీ వీడియో కాలింగ్ బూత్ అనుకోవచ్చు. ఇదో అధునాతన హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ల కలబోత. కంప్యూటర్ విజన్, మెషిన్ లెర్నింగ్, స్పేషియల్ ఆడియో, రియల్ టైమ్ కంప్రెషన్ పరిజ్ఞానాలను మేళవించి దీన్ని రూపొందిస్తున్నారు. ఇందులో టీవీ సైజులో ఒక డిస్‌ప్లే ఉంటుంది. దీని ముందు కూర్చొని అవతలివారిని చూస్తూ మాట్లాడొచ్చు. జూమ్ వంటి టూల్స్‌తో ఇప్పటికే మాట్లాడుతున్నాం కదాని అనుకుంటున్నారేమో. స్టార్‌లైన్ డిస్‌ప్లే తీరే వేరు. ఇది శబ్దం, లోతు జ్ఞానాన్ని సృష్టించే దృశ్యక్షేత్రంతో (విజన్ ఫీల్డ్) కూడుకొని ఉంటుంది. రికార్డయిన ఇమేజ్‌ను వివిధ కోణాల్లో ప్రసరింపచేయడం ద్వారా 3డీ వీడియోను ప్రొజెక్ట్ చేస్తుంది.

### ఎలా పనిచేస్తుంది

స్టార్‌లైన్ టీవీ తెరకు పైనా, కిందా, కుడి, ఎడమలో రెండేసి చొప్పు..మొత్తం ఆరు కెమెరాలుంటాయి. ఇవి శరీరం స్థితిని, కదలికలను నిరంతరం పసిగడతాయి. వేర్వేరు పొజిషన్‌లలో తీసిన చిత్రాలను ఈ కెమెరా జతలు ఒకే దృశ్యంగా మారుస్తాయి. ఇలా 3డీ ఎఫెక్ట్‌ను సృష్టిస్తాయి. ఒకరకంగా ఇది హోలోగ్రాఫిక్ కార్డుల మాదిరిగా పనిచేస్తుందని చెప్పుకో వచ్చు. ఈ కార్డులను ముందూ వెనకలకు తిప్పినప్పుడు వేరే దృశ్యం లేదా 3డీ ప్రభావం కనిపిస్తుంది కదా. ఎడమ కంటి కన్నా కుడి కన్ను కాస్త భిన్నమైన దృశ్యాన్ని చూడటం వల్ల దృశ్యం లోతును చూస్తున్న భ్రాంతిని కలిగిస్తుంది. స్టార్‌లైన్ తెర చుట్టూ ఉండే ఆరు కెమెరాలూ ఇలాంటి పనే చేస్తాయి. ఇవి వేర్వేరు కోణాల్లో ముఖం, శరీరం, కదలికలను 3డీలో రికార్డు చేసి, కాల్ చేస్తున్నవారికి ప్రదర్శిస్తాయి.

దీంతో టీవీ తెరమీద చదును దృశ్యం మాదిరి కాకుండా నిజంగా అవతలి వారు ఎదురుగా ఉన్నట్టే అనిపిస్తుంది. పొడవు, వెడల్పుతోపాటు లోతూ తెలియటం వల్ల వాస్తవ ప్రపంచాన్ని చూస్తున్నామనే భావన కలుగుతుంది. అందువల్ల మామూలు వీడియో కాల్‌లో సాధ్యం కాని హావభావాలనూ స్పష్టంగా చూడొచ్చు.




### ప్రత్యేకమైన నెట్‌వర్క్ అక్కర్లేదు

3డీ వీడియో కాలింగ్ అనుభూతిని కలిగించినా స్టార్‌లైన్‌కు ప్రత్యేకమైన అంతర్జాల నెట్‌వర్క్ అవసరమేమీ లేదు. ప్రామాణిక వేగంతో కూడిన ఇంటర్నెట్ ఉంటే చాలు. జాప్యం లేకుండా సంప్రదింపులు జరపొచ్చు. కళ్లద్దాలు ధరించినా 3డీ దృశ్యం యథాతథంగా కనిపిస్తుంది. మాట్లాడేవారు గదిలో ఎక్కడ నిల్చున్నారు? ఎంత పొడవున్నారు? చుట్టుపక్కల ఏమేం ఉన్నాయి? అనేవి స్పష్టంగా తెలియటం వల్ల ప్రత్యక్షంగా కలిసి సంభాషిస్తున్న భావన కలుగుతుంది.

### హెడ్‌సెట్, కళ్లద్దాల్లేకుండా..

యాపిల్ విజన్ ప్రో వంటి హెడ్‌సెట్లతో 3డీ వీడియో కాల్స్ చేసుకోవచ్చు కదా! స్టార్‌లైన్ గొప్పతనమేంటి? అనే సందేహం రావొచ్చు. నిజానికి 3డీలో వీడియోకాల్స్ చేసుకోగల, ప్రత్యక్ష



అనుభూతిని కలిగించగల పరిజ్ఞానమేదీ ఇప్పటివరకూ అందుబాటులో లేదు. విజన్ ప్రోతో ఫేస్‌టైమ్ కాల్ చేసుకోవచ్చు. 3డీరూపంతో ఛాట్ చేయొచ్చు. అయితే స్టార్‌లైన్ పరిజ్ఞానానికిది తులతూగలేదు. స్టార్‌లైన్‌తో మరో వెసులుబాటు సౌకర్యం. పెద్దపెద్ద హెడ్‌సెట్లను తలకు ధరించాల్సిన పనుండదు. సుదీర్ఘంగా సెట్ చేసుకోవాల్సిన అవసరమూ ఉండదు. టీవీలాంటి పరికరాన్ని ఆన్ చేస్తే చాలు. తెరమీద నుంచే నేరుగా మాట్లాడుకోవచ్చు.

### ఆచరణీయమేనా?

వీడియో కాన్ఫరెన్స్ వ్యవస్థల్లో అన్నింటికన్నా పెద్ద సవాలు వీటిల్లోని పరిజ్ఞానమే. ఇది ఆచరణీయమే అయినా చాలా కంపెనీలు 2డీ దృశ్యాలకే పరిమితమయ్యాయి. ఫలితంగా వీడియో సమావేశాలు ఇప్పటికీ ప్రాథమిక దశలోనే కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో స్టార్‌లైన్ విధానం కంపెనీ బోర్డు గదుల్లోకి విస్తరించగలదని గూగుల్ భావిస్తోంది. ఎక్కడో సుదూరంగా ఉన్న ఉద్యోగులతోనూ 'ప్రత్యక్షంగా చర్చలు' జరిపేందుకు వీలు కల్పిస్తుంది. కాబట్టి మెరుగైన గ్రూప్ సంభాషణలకు తోడ్పడుతుంది. ఇలాంటి 3డీ వీడియో కాలింగ్ వ్యవస్థలకు ఇతర సంస్థలూ ప్రయత్నిస్తున్నాయి. మైక్రోసాఫ్ట్ సంస్థ తమ హోల్‌పోర్టేషన్ పరిజ్ఞానంతో 3డీ ఇమేజింగ్ విధానాన్నే వాడుకుంటోంది. ఇది వస్తువుల 3డీ ఇమేజెస్‌ను సృష్టిస్తుంది. అయితే ఇందులో ఎలాంటి డిస్‌ప్లే ఉండదు. హోలోలెన్స్ మిక్స్‌డ్ రియాల్టీ హెడ్‌సెట్‌తో హోలోగ్రాఫిక్ అనుభూతిని ప్రసాదిస్తుంది. అయితే ఇది ఆటంకాల్లేకుండా వీడియో సమావేశాల నిర్వహణకు అంతగా ఉపయోగపడకపోవచ్చని భావిస్తున్నారు.

### సవాళ్లు లేకపోలేదు

వాణిజ్యపరంగా ఎంతవరకు విజయం సాధిస్తుందనేది స్టార్‌లైన్‌కు లభించే ఆదరణ మీద ఆధారపడి ఉంటుంది. దీని హార్డ్‌వేర్‌ను సెట్ చేయటానికి ప్రస్తుతానికి ఒక గది కావాలి. ఇది అందరికీ, అన్నిచోట్లా సాధ్యం కాకపోవచ్చు. అదే హార్డ్‌వేర్ సైజును చిన్నగా చేయగలిగితే ఎక్కువమంది వాడుకోవటానికి మార్గం సుగమం అవుతుంది. ప్రస్తుతానికి ఖర్చూ కూడా ఒక సవాలే. స్టార్‌లైన్ ధర ఎక్కువ కావటం వల్ల కొన్ని సంస్థలే మొగ్గు చూపొచ్చు. మరో సవాలు యాప్ సపోర్టు. స్టార్‌లైన్‌కు మీట్, జూమ్ తగిన వేదికలు. గూగుల్ సంస్థ ఇప్పటికే తమ మీట్ వేదిక మీద దీన్ని అందుబాటులోకి తేవాలని అనుకుంటోంది. జూమ్‌తోనూ జట్టుకట్టాలని భావిస్తోంది. ప్రస్తుతానికైతే స్మార్ట్‌ఫోన్లకు వర్తింపజేయకపోవచ్చు. మరిన్ని ఎక్కువ యాప్‌లకు సపోర్టు లభిస్తే ఎక్కువమంది వాడుకోవచ్చు. ముందుముందు థర్డ్‌పార్టీ యాప్‌లకు ఈ పరిజ్ఞానాన్ని వర్తింపజేయగలిగితే ఆదరణ పెరిగే అవకాశం లేకపోలేదు.

## కార్టూన్లకు ఆహ్వానం

కార్టూనిస్టుల నుండి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని కార్టూన్ల తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. కార్టూన్లు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-500 080.
sunmagvaartha@gmail.com

కథ

# తగవు

ఒక రాజ్యంలో ప్రజలు చీటికీ మాటికీ తగాదాలు పడుతూ తన్నుకుంటుంటారు. సమీపాన ఉన్న పూలవనంలో ఒక కందిరీగ, తేనెటీగలు ఈ విషయమై మాట్లాడుకోసాగాయి.
'ఈ జనాలు ఎందుకు తగాదా పడుతుంటారు? వీరి మధ్య తగవు ఎందుకు వస్తుంది?' అని కందిరీగ సందేహంగా తేనెటీగను అడిగింది.
'అవగాహనాలోపం వల్ల వీరి మధ్య తగాదాలు వస్తుంటాయి. ఈ జనం మధ్య తగవు పెట్టడానికి ఒక్క తేనె చుక్క చాలు' అని బదులిచ్చింది తేనెటీగ.
'అదెలా?' అమాయకంగా అడిగింది కందిరీగ.
వెంటనే తేనెటీగ ఒక చుక్క తేనెను అరుగుపై వేసి 'కొద్దిసేపు చూస్తూ ఉండు. ఈ ఒక్క తేనె చుక్కవల్ల ఇక్కడ పెద్ద తగవు జరగబోతుంది' అని చెప్పింది.



కొద్దిసేపటికి ఆ తేనెచుక్కపై కొన్ని ఈగలు వాలి తినసాగాయి. ఆ ఈగలను చూసిన బల్లి అక్కడికి వచ్చి ఈగలను తినసాగింది. మరికొద్దిసేపటికి ఆ బల్లిని ఒక పిల్లి వచ్చి తిన్నది. ఆ తరువాత ఒక కుక్క వచ్చి పిల్లి మెడ పట్టుకుని కొరికి చంపి తినసాగింది. ఇంతలో అక్కడకు వేరొక కుక్కవచ్చి చచ్చిన పిల్లిని తినడానికి పోటీ పడసాగింది. ఈ పెనుగులాటలో కుక్కలు రెండూ భీకరంగా పోట్లాడుకుని గాయాల పాలయ్యాయి. ఈ విషయం తెలిసి కుక్కల యజమానులు అక్కడికి వచ్చి నా కుక్కను నీ కుక్క గాయపరచింది అంటూ ఒకరికొకరు తగవు పడ్డారు.
ఇంతలో మరో వ్యక్తి వీరి మధ్యన దూరి 'నా పెంపుడు పిల్లిని మీ కుక్కలు చంపాయి. ఆ నష్టాన్ని ఎవరు పూడుస్తారు?' అంటూ ఇద్దరితో తగవు పడ్డాడు.
ఇంతలో తగవు మరో మలుపు తిరిగింది.
మన సామాజిక వర్గంపై వేరొకరు దాడి చేస్తున్నారంటూ కేకలు పెరిగిపోయాయి. ఎవరికి వారు అవగాహనా లోపంతో కోపోద్రేకులై కర్రలతో దాడి చేసుకుని తన్నుకుని ప్రజా ఆస్తులను ధ్వంసం చేశారు. ఇలా గొడవ పడిన వారందరినీ రక్షక భటులు బంధించి న్యాయమూర్తి వద్దహాజరు పరిచారు. ఎవరైతే తగవు పడి ప్రజా ఆస్తులకు నష్టం కల్గించారో ఆ మొత్తాన్ని నష్టపరచిన వారి నుండే వసూలు చేయాలని న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. ప్రజా ఆస్తులను ధ్వంసం చేసిన అన్ని సామాజిక వర్గాలవారితో పాటు, రెండు కుక్కల యజమానులు, పిల్లి యజమాని చచ్చినట్లు న్యాయమూర్తి తీర్పు ఇచ్చిన ప్రకారం నష్టపరిహారం చెల్లించి అనవసరంగా తగవు పడినందుకు తలలు పట్టుకుని కూర్చున్నారు.
ఇదంతా చూసిన కందిరీగ 'ఇప్పుడు నాకు పూర్తిగా అర్థమైంది. ఈ జనం అనవసర విషయాలలో తలదూర్చి తగవు పడుతూ తమ జాతిని తామే నాశనం చేసుకుంటున్నారు. నిజం చెప్పులు తొడిగేలోపు అబద్ధం ప్రపంచాన్ని చుట్టినట్లు వీరు ప్రవర్తిస్తున్నారు. ఎవరైనా అసత్యాన్ని నిజమని ప్రచారం చేస్తే వివేచన గల మానవులు ఏది నిజం? ఏది అసత్యం? అనే విషయాలను సరిచూసుకుని ప్రవర్తించకపోవడం వల్లనే వారి మధ్య తగాదాలు వస్తున్నట్లు నాకు అర్థమైంది' అని ఆవేదనతో అంది.

**– షేక్ అబ్దుల్ హకీం జాని**

## బాలగేయం

### వేసవి కేరింతలు



వేసవి సెలవులు
బడిపిల్లలకు సెలవులు
వారిని కేరింతలు
పెట్టించింది
ఉల్లాసం ఉత్సాహం
ఉప్పొంగించింది
బంధువుల ఇళ్లకు
వెళ్లారు చిరుతిళ్లను
ఆరగించారు
ఆటపాటలతో
సందడి చేశారు
స్విమ్మింగ్ పూల్‌కి
వెళ్లి ఈతకొట్టడం నేర్చారు
పార్కులన్నీ తిరిగి
ఆనందంగా
గంతులు వేయించింది
వేసవిసెలవులన్నీ
ఆనందంగా సాగింది
తిరిగి సొంత ఊళ్లకు
వచ్చాం.

– నాగముని.యం

## హాలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- పి.మణిమేఖల,** విజయవాడ

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. బ్లాక్‌బోర్డు మీద చాక్‌పీస్‌తో రాసేటప్పుడు కీచుమనే శబ్దం వస్తుంది..ఎందువల్ల?

**జవాబు: మణిమేఖల!** చాక్‌పీసుకు బోర్డుకు దాదాపు లంబంగాగానీ, పూర్తి లంబంగాగానీ పట్టుకుని రాసేటప్పుడు బ్లాక్‌బోర్డుకూ, చాక్‌పీస్‌కూ మధ్య ఘర్షణశక్తి చాలా తక్కువగా ఉంటుంది. అందువల్ల చాక్‌పీస్ జారిపోతూ 'కీచు'మనే శబ్దం చేస్తుంది. అయితే చాక్‌పీస్‌ను బోర్డుకు లంబంగా కాక కొంచెం ఏటవాలుగా పట్టుకుని రాస్తే ఘర్షణశక్తి పెరిగి శబ్దం మాయమవుతుంది.

**- బి.మణికంఠ,** హైదరాబాద్

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. ట్యూబ్‌లైట్ ఎలా వెలుగుతుంది?

**జవాబు: మణికంఠ!** ఒక గాజు గొట్టాన్ని తీసుకొని, దానికి లోపలి వైపున తెల్లటి ఫ్లోరోసెంట్ పదార్థాన్ని పూస్తారు(ఈ కారణంతోనే ట్యూబ్‌లైట్‌లకు పారిభాషిక పదం ఫ్లోరోసెంట్ బల్బ్) రెండు చివర్లలో టంగ్‌స్టన్ ఎలక్ట్రోడ్‌లను బిగిస్తారు. ఈ గాజుగొట్టంలో నుంచి గాలిని తీసివేసి, దానిలో కొంచెం పాదరసం, ఆర్గాన్ వాయువులను నింపుతారు. ట్యూబుకు విద్యుచ్ఛక్తి కనెక్షన్ ఇచ్చినప్పుడు టంగ్‌స్టన్ ఎలక్ట్రోడ్‌లు వేడెక్కి ఎలక్ట్రాన్‌లను ఉత్పత్తి చేస్తాయి. ఈ ఎలక్ట్రాన్‌లు పాదరసం అణువులతో కలిసి అతినీలలోహిత కాంతి వెలువరిస్తాయి. ఈ కాంతి కిరణాలు గాజు గొట్టానికి పూసిన ఫ్లోరసెంట్ పూతతో కలిసి మంచి కాంతినిస్తుంది. వాస్తవానికి మామూలు బల్బు కంటే ట్యూబ్‌లైట్ ఎక్కువ శాతం కాంతినిస్తుంది. తద్వారా విద్యుచ్ఛక్తి పొదుపు అవుతుంది, వాతావరణ కాలుష్యం ఏర్పడదు.

ప్రకృతి ఒడిలో అనేక వింతలు కనిపిస్తాయి. సహజసిద్ధమైన గుహలు, గలగల పారే సెలయేర్లు..జలపాతాలు.. కొండ గుహలు..అడవులు ప్రకృతి ప్రసాదించిన వరప్రసాదాలు.. ప్రకృతి వనరులపైనే మానవ మనుగడ ఆధారపడి ఉంది. పచ్చటి పంటపొలాల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆనందంగా జీవించే అవకాశం మానవునికే మాత్రమే ఉంది. ఆస్వాదించాల్సిన ప్రకృతిని మనిషి పట్టించుకోవడం లేదన్నది జగమెరిగిన సత్యం. ప్రకృతిలో భాగంగా సహజ సిద్ధంగా ఏర్పడిన గుహలు అద్భుతాలుగా నిలిచి ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి.



# వాల్మీకి గుహలను చూద్దామా!


నంద్యాల జిల్లాలోని డోన్ నియోజకవర్గంలో కరువు ప్రాంతంగా భావిస్తున్న ప్యాపిలి మండలంలోని మారుమూల గ్రామమైన రాచవాండ్లపల్లె సమీపంలో కళ్ళు చెదిరేలా ఉన్న ఆకృతులు, సహజత్వంతో ఏర్పడిన శిలాకృతులతో పర్యాటకులను అలరిస్తున్న వాల్మీకి గుహలపై ప్రత్యేక కథనం..రెండు దశాబ్దాల క్రితం వెలుగులోకి వచ్చిన వాల్మీకి గుహలలో విశేషాలను పరిశీద్దాం..చేయి తిరిగిన శిల్పులు చెక్కిన శిల్పాలు, శివలింగాన్ని అభిషేకించే నీటి ధారలు, సహజంగా ఏర్పడిన ఆకృతులు అద్భుతంగా నిలుస్తాయి.

**వాల్మీకి గుహలకు వెళ్లే మార్గం**

ప్యాపిలి నుండి గుడిపాడు, పిఆర్.పల్లి మీదుగా వాల్మీకి గుహలకు చేరుకోవచ్చు. డోన్ నుండి అయితే కొచ్చెర్వు, హుసేనాపురం, చంద్రపల్లె, పిఆర్.పల్లి మీదుగా వెళ్లవచ్చు.. బనగానపల్లె నుండి గార్లదిన్నె, జలదుర్గం, హుసేనాపురం మీదుగా రోడ్డు మార్గంలో చేరుకోవచ్చు. గుహలోకి వెళ్ళడానికి ప్రవేశ రుసుం కింద రూ50లను చెల్లించాలి. గుహల వద్ద హోటల్ ఏర్పాటు కాలేదు. కావున పర్యాటకులు తమ వెంట తాగునీరు, తినుబండారాలు తీసుకుని వెళ్ళాలి. 20 సంవత్సరాల క్రితం వెలుగులోకి వచ్చిన వాల్మీకి గుహలను మూడు కోట్ల రూపాయల నిధులతో ప్రభుత్వం అభివృద్ధి చేసింది.

**వాల్మీకి తపస్సు చేసిన గుహలు**

వాల్మీకి గుహలు సహజ సిద్ధత్వంతో పర్యాటకులను ఆకట్టుకుని ఆలరిస్తున్నాయి. 2004లో వెలుగులోకి వచ్చిన గుహలలో వాల్మీకి మహర్షి తపస్సు చేసినట్లు చెపుతున్నారు. గతంలో ఎంతో వ్యయ ప్రయాసలతో తాళ్ల సహాయంతో గుహలల్లోకి వెళ్ళి రావాల్సిన పరిస్థితి ఉండేది. ప్రజలకు వాల్మీకి గుహలను పర్యాటక కేంద్రంగా మార్చడానికి ప్రభుత్వం ముందుకు వచ్చి నిధులను కేటాయించి పర్యాటకులను ఆకట్టుకునే విధంగా అభివృద్ది చేశారు. గుహలలోకి వెళ్ళడానికి మెట్లను నిర్మించారు.



**గుహలో అద్భుత దృశ్యాలు**

గుహలలోకి దిగడానికి ముందు పైకప్పు మీద ఆవు పొదుగులను పోలిన శిలాజాలు ఆకర్షణగా నిలిచాయి. అపరనైపుణ్యంతో శిల్పులు చెక్కిన శిల్పాలను తలపించే విధంగా ఉన్న శిల్పసంపదను తిలకిస్తూ గుహలలోకి దిగుతుంటే మాటలలో చెప్పలేని అనుభూతి కలుగుతుంది. రంగుల రంగుల కాంతులతో మిరమిట్లు గొల్పే లైటింగ్ సిస్టమ్ ఆకర్షణీయంగా ఉంటుంది. కిందికి దిగిన తరువాత విశాల మైదానంలో మయసభ ప్రవేశాన్ని తలపించే విధంగా సహజంగా వెలిసిన



స్వాగత తోరణలు, ధ్వజస్తంభం కనిపిస్తుంది. కాస్త ముందుకు వెళ్ళితే గుహలకు ఇరువైపులా సహజంగా వెలిసిన రుద్రాక్షలు కనిపిస్తాయి. విబూదిని తలపించే విధంగా ఉన్న మట్టి ఉంటుంది. గతంలో అక్కడ ఉన్న సేలయేరు నీటితో తాగి దాహం తీర్చుకునే వారు. ప్రస్తుతం నీరు కలుషితంగా మారింది.

**శివలింగానికి జలాభిషేకం:**

వాల్మీకి గుహలలో సహజసిద్ధంగా ఏర్పడిన శివలింగం ఆకృతులు ప్రత్యేకత. గుహల పైభాగం నుండి నిత్యం నీటిధార శివలింగంపై పడుతూ అభిషేకం చేస్తున్న దృశ్యాలు పర్యాటకులకు ఆహ్లాదాన్ని అందిస్తున్నాయి. సహజ సిద్ధంగా ఏర్పడిన నంది ఆకృతిని కూడ చూడవచ్చు. అద్భుతాలకు ఆలవాలంగా నిలిచిన వాల్మీకి గుహలను సందర్శించి చూడదగ్గ పర్యాటక ప్రదేశాలలో ఇది ఒకటిగా నిలిచింది.

**- ఎస్.రహంతుల్లా,**
ప్రభాతవార్త, ప్యాపిలి

# మ్యాంగో బఫే

మ్యాంగో లవర్స్‌కి ఇష్టమైన వార్త అని చెప్పొచ్చు. సమ్మర్ అనగానే గుర్తొచ్చేది పండ్లరాజు మ్యాంగో. అలాంటి మామిడి పండ్లతో మ్యాంగో బఫేని అందిస్తోంది ఓ రెస్టారెంట్. కేక్‌లు దగ్గర నుంచి ఐస్‌క్రీమ్ వరకు అన్నింటిలోనూ మ్యాంగో ఫ్లేవర్ ఉంటుంది. ఎక్కడ? ఏ రెస్టారెంట్ ఇలా సర్వ్ చేస్తోందంటే.. మామిడి అంటే ఇష్టపడేవారి కోసం దక్షిణ కొరియాలోని ఒక రెస్టారెంట్ మామిడి పండ్లతో వెరైటీ బఫేని పరిచయం చేసింది. సియోల్‌ని లోట్టే అనే హోటల్ ఈ వెరైటీ బఫేట్‌ని కస్టమర్లకు సర్వ్ చేస్తోంది. దీని ధర వచ్చేసి రూ 8,257లు. ఈ వేసవి మొత్తం ఈ బఫేట్ అందుబాటులో ఉంటుందని చెబుతున్నారు రెస్టారెంట్ నిర్వాహకులు. ఆ బఫేలో మామిడి పండ్లతో చేసిన కేక్, మ్యాంగో పుడ్డింగ్, మ్యాంగో



డెజర్ట్, మ్యాంగో ఐస్‌క్రీమ్, స్పైసీ రైస్ కేక్‌లతో సహ పదిరకాల వెరైటీలను ఈ బఫేలో అందిస్తారు. వెరైటీ భోజనం కావాలనుకునే వాళ్లకు ఇది అద్భుతమైన బఫే సెటప్ అని చెప్పొచ్చు. ఆ రెస్టారెంట్ చుట్టూ ఉండే ఆహ్లాద కరమైన వాతావరణం లో ఈ బఫే కస్టమర్లకు ఓ గొప్ప అనుభూతిని ఇస్తుంది. ముఖ్యంగా అక్కడ ఉండే సుందరమైన జలపాతం, కళాత్మక అలంకరణల మధ్య ఈ మ్యాంగో బఫేని అధిక ధరకు వెచ్చించి మరీ తినడం కస్టమర్లకు ఓ మధరమైన జ్ఞాపకం లా ఉంటుందట. అందుకు సంబంధిం చిన వీడియో నెట్టింట తెగ వైరల్ అవుతోంది. దీన్ని చూసిన నెటిజన్లు మామిడి ప్రియులకు ఇది బెస్ట్‌ప్లేస్ అని ఒకరు, ఇది స్వర్గానికి మించి! అని మరొకరు కామెంట్లు చేస్తున్నారు.

# పూలు తెస్తే జరిమానా

సాధారణంగా గుడికి వెళ్లేటప్పుడు ఎవరైనా పూలు తీసుకెళతారు. కేరళలో మాత్రం పూలు తెస్తే ఫైన్ వేస్తాం అంటోంది అక్కడి దేవాదాయ కమిటీ. అదేంటని కంగారుపడుతున్నారా..అన్ని పూలు కాదులెండి, గన్నేరు లేదా కరివేరు పూలను తెస్తేనే జరిమానా విధిస్తారు. అయినా అపార్టుమెంట్ల చుట్టూ, ఆలయాల దగ్గరా ఇంటి ఆవరణలోనూ చాలామంది కరివేరు (ఒలియాండర్) మొక్కల్ని పెంచేదే ఆ పూలకోసం. చెట్టునిండా గుత్తులుగా పూసే ఆకర్షణీయమైన ఆ పూలను చాలామంది దేవుడి ఫొటోలకు పెడతారు. పూజల్లో వాడుకుంటారు. అందుకే మన దగ్గర కూడా ప్రతి ఆలయంలోనూ ఈ మొక్కలు కనిపిస్తుంటాయి. వాటిని రోడ్డు పొడవునా డివైడర్ల మధ్యలో కూడా నాటతారు. అయితే కేరళలో మాత్రం ఈమధ్య కరివేరు పూలను పూజల్లో



వాడకూడదనీ, మొక్కల్ని పెంచుకోవద్దనీ అక్కడి దేవాదాయ కమిటీ నిర్ణయించి ఆ రాష్ట్రంలోని దాదాపు మూడువేల ఆలయాల్లో ఆ పూలను నిషేధించింది. ఓ మహిళ పొరపాటున ఆ పూరేకుల్ని నోట్లో వేసుకోవడంతో తీవ్ర అనారోగ్యానికి గురై ప్రాణాలు కోల్పోయింది. సాధారణంగా ఔషధాల తయారీలో వాడే ఈ మొక్కలో విషపదార్థం ఉంటుంది. అందువల్ల సంస్థలు ప్రాసెస్ చేశాకే ఉపయోగిస్తారు. నేరుగా తీసుకుంటే ప్రమాదం కాబట్టి శ్రీలంక, దక్షిణాసియా దేశాల్లో దీన్ని సూసైడ్ మొక్క అని పిలుస్తారు. అంత ప్రాణాంతకం కనుకే ఆ మొక్కల్ని దూరం పెట్టమంటోంది కేరళ కమిటీ.

కథ

# రైలు ప్రయాణం

సింగంపల్లి శేష సాయి కుమార్

పట్టాలపై వేగంగా పరిగెత్తాల్సిన రైలు ఎందుకో చంటోడి చిన్న సైకిలు టైరోలే ఈడ్చుకుంటూ వెళ్తోంది. ఉదయం సూర్యుడు కళ్లు తెరవక ముందే ఇంట్లో నిద్ర లేచి పిల్లోల్లకు నీళ్లు పోసి, తినడానికి అటుకులు కారం పెట్టి, చక చక ఊర్లోని సిద్దప్పన్న ఆటో మాట్లాడుకొని అందర్నీ ఎక్కించి స్టేషనుకు వచ్చి కూర్చుంటే అప్పుడే మైకులో గట్టిగా అరిచి చెప్పింది ఒకామె.

"ప్రయాణికులకు విజ్ఞప్తి.. ట్రైన్ నం.07658 హుబ్బళ్ళి నుండి తిరుపతి వెళ్లవలసిన ఇంటర్ సిటీ ప్యాసింజర్ మరికొద్దిసేపట్లో ఒకటో నంబరు ప్లాట్‌ఫామ్‌పైకి వచ్చును".

అది వినపడగానే ఎర్రయ్య దబీలని నోట్లో పెట్టుకున్న చుట్టను ఇసిరి నేలకొట్టి "ఓమ్మీ, నువ్వు బిడ్డల్ని పట్టుకో, నేను మూటల్ని పైకి ఎక్కిస్తా, అసలే సీట్లుంటాయో లేదో?"

"అదేం లేదులేబ్బా.. ఎక్కడో చోట కాసింత సీటు దొరక్కపోతాదా ఏంది, గొమ్మున ఎక్కులే" అంది.

ఎలాగోలా ఇద్దరు చంటిపిల్లల్ని ఎక్కించగానే కిటికీ పక్కన ఓ ముగ్గురు కూర్చునే సీటు ఖాళీగా కనపడింది. అది చూడగానే బుడ్డగాని ఆనందం అంతా ఇంతా కాదు. ప్రపంచంలో అంత సంతోషం ఎవరి ముఖంలోనూ కనపడదు.

.........

రైలు ఒక్కో స్టేషనులో ఆగుతూ.. ఆగుతూ మధ్యాహ్నం గుంతకల్లు చేరింది. పిల్లోల్లు కిటికీలలోంచి చూస్తూ చూస్తూ అలా ఎప్పుడో నిద్రలోకి జారుకున్నారు. జంక్షనులో జనాల అరుపులకి, ఉక్కపోత పెరిగి గజ గజలాడే చలిలో వాళ్లకు పట్టిన చెమటచుక్కలు నిద్ర లేపేసాయి.

"రేయ్ చిన్నా, అన్నం తిందురు లేవండి" అంది లక్ష్మి.

ఇద్దరూ అమ్మకు చెరో వైపు చేరిపోయారు. ఇంట్లో వండుకొచ్చిన నిమ్మకాయపులుసు అన్నం తన పెద్ద చేత్తో ఎత్తి వాళ్ల చిన్న చిన్న నోటికి అందిస్తోంది ఆమె.

ఇద్దరూ తిన్నాక మిగిలింది ఒకే కంచంలో పెట్టుకుని చిలకా గోరింకల్లా తిన్నారు వాళ్లు.

సూర్యుడు చకచకా వెళ్లిపోతున్నాడు. కానీ వేగంగా పరిగెత్తాల్సిన రైలుబండి మాత్రం ఎందుకో మొండికేస్తోంది. పోను పోను ప్రయాణం భారంగా ఉంటోంది.

ఎర్రయ్యకు పోయిన సాలు జబ్బు పడింటే కొండకు నడిచి వస్తానని మొక్కుకుంది లక్ష్మి. అందుకే తిరుపతి ప్రయాణం. పిల్లలు పుట్టినప్పటి నుంచీ తిరుపతి వెళ్లనేలేదు.

అయినా తిరుపతి అంటే వాళ్లకు చాలా బరువుతో కూడుకున్నది. దాచి పెట్టుకున్న కాసింత డబ్బుతో కొండకు వచ్చి మొక్కు తీర్చుకుంటున్నారు.

.........

రైలు సాయంత్రం పొద్దు గూకే ఏలకు యార్రగుండ్ల చేరింది.

"ఇంకెంత దూరం?" అంది లక్ష్మి.

ఇంకా చాలా దూరం కడపే రాలేదింకా... అన్నాడు ఎర్రయ్య.

"ఏ యాలకు పోతాదో కదా" అంది ముఖం నల్లగా పెట్టుకొని. ఒకవైపు పిల్లలు మరోవైపు అక్కడికి వెళ్లి ఎలా దర్శనం చేసుకోవాలో తెలియదు. ఈ పరిస్థితులకు తోడు ఇప్పుడు ఈ రైలు బాగా పొద్దు పోయాక వెళ్తోంది. రైలు దిగి రాత్రికి ఎలా వెళ్లాలో దిక్కు తోచలేదు.

రైలు రాత్రి 7 గంటలకు కడప చేరింది. పిల్లలు దప్పికగా ఉంది అని నీళ్లడిగారు. పట్టుకొస్తా బాటిలు ఇట్టీ అని దిగి ఎదురుగా ఉన్న కుళాయి కింద పెట్టాడు.. నీళ్ల పట్టి పట్టి వస్తున్నాయి. ఎలాగోలా బాటిల్ నిండింది.

రైలు కూతకు పరిగెత్తి పెట్టెలోకి ఎక్కాడు.

ఇంద.. తీసుకో అంటూ చిన్నోడికి ముందు అంటూ నీళ్ల బాటిల్ అందించాడు. పక్కనే కూర్చున్న రోజూ కడపకు వచ్చీ పోయే పెద్దమనిషి "అయ్యో, ఆ నీళ్లు బిడ్డకు వద్దు అసలే ఆ ట్యాంకు ఎప్పుడు కడిగింటారో? ఏమో?" అన్నాడు. దాంతో నోట్లో పెట్టుకున్న బాటిల్ను కాస్తా గబుక్కున లాగేసింది లక్ష్మి.

ఇప్పుడెలా అనేలా ముఖం పెట్టింది లక్ష్మి. "ఇంకో అరగంటకు నందలూరు వస్తుంది. అక్కడ ఏటినీళ్లు ఉంటాయి. మేం చిన్నప్పటి నుండి అవే నీళ్లు తాగుతున్నాం. కావాలంటే అక్కడ పట్టుకోండి" అన్నాడు ఆ పెద్ద మనిషి.

అబ్బా... అన్నట్టు ఊపిరి పీల్చుకున్నారు ఇద్దరూ. అయినా అంతదాకా మనం ఉండొచ్చు కానీ పిల్లలకెలా అనుకొని అటువైపుగా అమ్ముకుంటూ పోతున్న నీళ్లవాడిని "ఓయ్యో, ఎంత?" అని అడిగాడు ఎర్రయ్య.

"ఆ..20" అన్నాడు వాడు.

"పదికిస్తావా? రెండు తీసుకుంటా" అన్నాడు ఎర్రయ్య.

ఊరికి ఇస్తా... తీసుకుపో అంటూ వెటకారంగా అక్కడి నుండి వెళ్లబోతున్నవాణ్ణి "అన్నా, ఇందా... ఒకటియ్యి" అంటూ పవిట చివర ముడి తీసి డబ్బులు ఇచ్చింది.



దాంతో పిల్లలు దప్పిక తీర్చుకుంటే, వీళ్లిద్దరూ గొంతు తడుపుకున్నారు.

.........

కాసేపు కాలం గడిపేసరికి ఎనిమిదిన్నర బండి ముక్కుతూ... మూలుగుతూ నందలూరులో ఆగింది.

ఎర్రయ్య ముందే సిద్ధం చేసుకున్న బాటిళ్లతో నీళ్ల పట్టుకొచ్చాడు. రైలు ఇంకాస్త కదిలి రాజంపేట చేరింది. అప్పుడ సరిగ్గా టైం 9.30.

అదేందోగానీ పట్టుమని పది కిలోమీటర్లకు ఒక గంట పట్టింది. పిల్లలు అప్పటికే తమ దగ్గర ఉన్నది తిని తల్లి ఒడిలో కునుకు తీసారు

"అదేందన్నా, ఈ రైలు రోజూ ఇంతేనా?" అంది లక్ష్మి.

"నేను రోజూ వస్తుంటా. ఈ బండి తిరుపతికి పోయేసరికి తెల్లారి ఒకటి, ఒకటిన్నర అవుతాది అన్నాడు ఆ మనిషి.

"అంతసేపు ఏంటికన్నా, మధ్యలో ఎక్కడైనా ఆపేస్తారా?" అంది.

"ఆ... రేణిగుంట ఇవతల ఆపేస్తారు" అన్నాడు ఆయన.

మనసులోని కొత్త ప్రదేశంపై వాళ్లకున్న భయం వాళ్ల కళ్లలో కనపడుతోంది.

"దర్శనానికి పోతాండారా?" అంటూ మళ్లీ వాళ్లతో మాట కలిపాడు ఆ పెద్దాయన.

"అవునన్నారు" ఇద్దరూ ఒకేసారి.

"మరేం ఇబ్బంది లేదు. రాత్రిపూట కూడా పెద్దాయన కాడ అంతా సవ్యంగా ఉంటాది. మీరు రైలు దిగినాక పక్కనే సామిసత్రాలు ఉంటాయి. అక్కడ పడుకోండి. పొద్దుగాలే లేచి స్టేషను ముందుపక్క ఓ పెద్ద బిల్డింగుకు నామాలు ఉంటాయి. ఆడ మెట్లకాడికి ఫ్రీ బస్సు ఉంటుంది. దాన్ని ఎక్కిపొండి. ఇక అంతా ఆ పెద్దాయనే చూసుకుంటాడు" అన్నాడు.

ఇద్దరికీ ఎంతో ధైర్యాన్ని కలిగించాయి ఆయన మాటలు. కొత్త ప్రదేశంపై వాళ్లకున్న అనుమానాల్ని కాస్త తొలగించాడు పెద్దాయన.

.........

కొండపైన ఉన్నోనికి, లేనోనికి పెద్ద తేడా ఏమీ ఉండదు.

ఆయన మనల్ని చూడాలేగానీ టక్కున రప్పించుకుంటాడు. తిరుపతిలో ఉండి కూడా దర్శనానికి వెళ్లలేని పరిస్థితి ఉంటుంది తెలుసా?

కొండపైకి పోగానే కల్యాణ కట్టలో గుండ్లు కొట్టుకున్నారు పిల్లలు, ఎర్రయ్య. పక్కనే సేవకులు బండిపై వేడి వేడి ఉప్మా పెడుతున్నారు. పిల్లలను చూసి ఇంకో దొప్ప ఎక్కువిచ్చారు. అందరూ కోనేరులో మునిగి, వరాహస్వామిని చూసి, అక్కడి నుండి దర్శనం క్యూలోకి వెళ్లారు.

కొండంతా జోరున వాన.. మాడవీధులన్నీ నీళ్లతో పారి కడిగేస్తున్నాయి. వానలోనే ఎప్పుడూ తడవని జనం ఇక కుంభవృష్టికి ఎలా బయటికొస్తారు చెప్పు. రాను రాను క్యూలోకి వచ్చేవారి సంఖ్య తగ్గిపోయింది. దర్శనానికి క్యూ వదిలారు.

జనం తోపులాట లేదు. ఒకవైపు నీటి తుంపరలు కాళ్లకు, ముఖానికి కొడుతుంటే వెనక ఎవ్వరూ తోసేవాళ్లు లేకుంటే టి.వి.లలో చూపెట్టినట్టు ప్రశాంతంగా నడుచుకుంటూ వెళ్తున్నారు.

అబ్బా... అదేమి దర్శనం? ఇంతవరకు పుట్టి బుద్దెరిగినప్పటి నుండి సామిని అలా చూడలేదు. లక్ష్మికి కళ్లలో నీళ్ల తిరుగుతున్నాయి. అలానే బయట బంగారు బావి దగ్గరకు వచ్చేసరికి పైనుండి వస్తున్న తుంపర్లతో అవి కలసిపోయాయి.

పిల్లలిద్దరూ చేతులు పైకెత్తి గోవిందలు కొడుతున్నారు. అలా బయటికి వెళ్లి చుట్టూ ప్రదక్షిణంగా స్వామివారి హుండీ దగ్గరికి వెళ్లి ఎంతో అపురూపంగా భక్తితో కట్టిన ముడుపును కళ్లకు అద్దుకుని అందులో వేసింది లక్ష్మి.

వెండివాకిలి దాటి ప్రసాదాల క్యూలోకి బయలుదేరారు నలుగురు. అక్కడిస్తున్న దొప్పల్లోని వేడి వేడి పొంగలి పిల్లలకు తినిపించి బయట వచ్చే కొళాయిలోని నీరు తాగి మరొక్కసారి వాకిలి వైపు తిరిగి "గోవిందా.... గోవిందా" అని గట్టిగా అరుస్తూ బయటికి కదిలారు.

లడ్లు తీసుకొని తిరిగి తమ ఊరికి బయలుదేరడానికి తిరుపతి వచ్చి మళ్లీ ఉదయాన్నే 6 గంటలకు బయలుదేరే హుబ్లీ ఇంటర్‌సిటీ ప్యాసింజర్ కోసం ఎదురు చూశారు. ఇంతలో మళ్లీ వాళ్లకు అక్కడ కనపడ్డాడు ప్రయాణంలో కలిసిన పెద్దాయన. "ఏమ్మా, దర్శనం బాగా జరిగిందా?" అన్నాడు.

ఆయనను గుర్తు పట్టి "ఆ... అన్నా బాగానే జరిగింది. మీరు చెప్పినట్టు అక్కడికి వెళ్లాక అంతా ఆ పెద్దాయన చూసుకున్నాడు.

అంతే... అమ్మా! ఆయన పిలిచాడు

**"ఈ బండి తిరుపతికి పోయేసరికి తెల్లారి ఒకటి, ఒకటిన్నర అవుతాది అన్నాడు, ఆ మనిషి.**

**"అంతసేపు ఏంటికన్నా, మధ్యలో ఎక్కడైనా ఆపేస్తారా?" అంది.**

**"ఆ... రేణిగుంట ఇవతల ఆపేస్తారు" అన్నాడు ఆయన.**

**"దర్శనానికి పోతాండారా?" అంటూ మళ్లీ వాళ్లతో మాట కలిపాడు ఆ పెద్దాయన.**

అంటే అలానే ఉంటుంది. నేను చెప్పానుగా... ఆయన ఆజ్ఞ ఉంటే అంతే. అక్కడికి వెళ్లలేదని అంటూ పిల్లల తలపై చేయి వేసి నిమిరాడు పెద్దాయన. రైలు ఓ రెండు గంటల తర్వాత రాజంపేటలో ఆగింది. ఆ పెద్దాయన వాళ్లను జాగ్రత్తగా వెళ్లి రండి.. అంటూ రైలు దిగి పిల్లలకు చేయి ఊపాడు.

పిల్లలు కూడా కిటికీలోంచి ఆనందంగా తమ రెండు చేతులు ఊపుతూ పెద్దాయనకి వీడ్కోలు చెబుతున్నారు.

పాపం.... ఎంత దూరం నుంచి వస్తున్నారు? నిజంగా ఈ రైలు వాళ్లకు ఒక వరం. ఎందుకంటే తక్కువ డబ్బుతో ఎక్కువ దూరం ప్రయాణం చేసే అవకాశం ఇక్కడే ఉంది. కానీ ఆరోజు రాత్రి వాళ్ల పడ్డ ఇబ్బంది వర్ణనాతీతం. కొత్త ప్రదేశంలో రాత్రిపూట వేళ కాని వేళలో దిగడం వాళ్ల గుండెల్లో రైళ్ల పరిగెత్తించింది. ప్రయాణం అనుకున్నప్పుడు ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా సాగితే దాని ఆనందమే వేరు.

ఆ రోజు వాళ్ల ఆలోచనలు వాళ్ల ప్రయాణాన్ని హాయిగా సాగనీలేదుగానీ ఈరోజు వాళ్ల తమ గమ్యం చేరుకుంటున్నాం... అన్న ఆనందంతో చేస్తున్న ఈ ప్రయాణం వాళ్లకు జీవిత కాలం గుర్తుండిపోతుంది. జీవితంలో ప్రతి క్షణాన్ని ఆనందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది కదా! పిల్లలు కిటికీలో నుంచి చూసే పచ్చటి పంటపొలాలు ఎత్తయిన కొండలు, బీడువారిన భూములు.. ఇలా ఒకటేమిటి? అన్ని వాళ్ల కళ్లతోనే ఫొటోలు తీస్తూ మనసులో నిక్షిప్తం చేసే ప్రయాణం ఓ మంచి అనుభవం... ఇంకా రైలు ప్రయాణం ఓ అద్భుతం. ✦

# ఆభరణాలకు భారత్ పుట్టినిల్లు

**"భవిష్యత్తులో 10 గ్రాములు బంగారం ధర లక్ష రూపాయలకు చేరుతుంది" అనే భావన నిజం కాబోతున్న వేళ... అసలు ఈ బంగారం, వెండి, విలువైన రాళ్లు(నవరత్నాలు), వజ్రాలు వంటి వాటితో తయారు చేసిన ఆభరణాలకు భారతీయులు ఎందుకు ఇంత ప్రాధాన్యత ఇస్తారో... ఒకసారి చరిత్ర తిరగేస్తే సబబుగా ఉంటుందేమో!**



భారతీయ నాగరికతలో ఆభరణాలకు సుమారు 8000 సంవత్సరాల క్రితం నుంచి ప్రాధాన్యత సంతరించుకుంది అని తెలుస్తోంది. భారతీయ సమాజంలో రాజకీయ ఆర్థిక సాంస్కృతిక చిహ్నాంగా ఆభరణాలు గతం నుంచి నేటి వరకూ ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి.

మనలో చాలామంది తరచూ 'కోహినూర్ వజ్రం' అని అంటుంటాం. మా అమ్మాయి/అబ్బాయి బంగారం అని తరచూ సంబోధిస్తాం. అంటే ప్రతీ మంచి విషయంలో, విజయంలో ఈ మాటలు వాడుతూ ఉంటాం. ఈ విధంగా మన జీవితంలో మమేకమైన ఈ ఆభరణాల చరిత్ర పరిశీలిద్దాం.

హరప్పా మెహంజోదారోలో జరిగిన ఆర్కియాలజికల్ తవ్వకాలలో లభించిన ఆధారాలను బట్టి ఆనాడే హరప్పా మెహంజోదారోలో ప్రజలు బంగారం, వెండి విలువైన రాళ్లతో తయారు చేసిన వివిధ ఆభరణాలు ధరించినట్లు, వివిధ దేశాలతో ఆభరణాల వ్యాపారం చేసినట్లు తెలుస్తోంది. తదుపరి మౌర్యులు, గుప్తులు, చోళులు, పల్లవులు, చాళుక్యులు, మహమ్మదీ

**ఐ.ప్రసాదరావు**

యులు, మొఘలులు, పోర్చుగీసు, బ్రిటిష్ వారి కాలంలో ఆభరణాలకు ప్రాధాన్యత సంతరించుకోవడంతో పాటు రకరకాల డిజైన్లతో మారుతున్న కాలానికి అనుగుణంగా భారతీయులను ఆకర్షిస్తూ ఆభరణాలు ప్రముఖ పాత్ర పోషించాయి. క్రీ.పూ.1500నాడే సింధు ప్రజలు బంగారంతో తయారైన చెవిరింగులు, నెక్లెస్‌లు, పూసల నెక్లెసులు, మెటల్స్‌తో తయారైన ఆభరణాలు ధరించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా సింధూ నాగరికత కాలంలో 'పూసల' వర్తకం బాగా జరిగింది. వివిధ రకాల పూసలు తయారు చేయడంలో, రంగులు అద్దటంలో సింధు ప్రజలు ఆరితేరినట్లు కనపడుతుంది. హిందూ మతానికి సంబంధించిన వివిధ గుర్తులు, చిహ్నాలతో పూసలు తయారు చేసుకుని, ధరించేవారు.



మహిళలు నత్తగుల్లలతో తయారైన బ్రాస్‌లెట్లు, మట్టితో తయారు చేసిన అలంకరణలు ఎక్కువగా ధరించేవారు. కొన్ని రకాల పిండిలుతో తయారు చేసి, వాటికి నల్లటి రంగు వేసినవి ధరించేవారు. ఇప్పుడు కూడా గాజు/కొన్ని రకాల లోహాలతో తయారు చేసిన గాజులు తయారు చేస్తున్నారు, ప్రజలు ధరిస్తున్నారు.

మహిళలు నుదుట బంగారంతో తయారైన పాపిడి బొట్టు లాంటివి ధరించేవారు. అంతేకాకుండా చెవిరింగులు, పిన్నులతో కూడిన తలలో పెట్టుకునే వస్తువులు, మెడకు పెట్టుకునే చోకర్లు, బంగారు ఉంగరాలు తదితర ఆభరణాలు హరప్పా మెహంజోదారోలో ప్రజలు ధరించినట్లు చరిత్ర చెబుతోంది.

బంగారు నగలు మహిళలు ఎక్కువగా ధరిస్తే పూసలతో కూడిన ఆభరణాలు మగవారు తరచుగా ధరించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా సింధూ నాగరికత కాలంలో ప్రజలు తలలో చిన్న చిన్న పూసలతో కూడిన ఆభరణాలు ఎక్కువగా ధరించేవారు. గోధుమరంగు రాయితో తయారు చేసిన బ్రాస్‌లెట్లు కూడా వాడినట్లు తెలుస్తోంది.

హరప్పా ప్రజలు బంగారం, వెండి, రాగి, విలువైన రాళ్లతో తయారు చేసిన ఆభరణాలను ధరించినట్లు తెలుస్తోంది.




నెక్లెస్లు, బ్రాస్‌లెట్లు, గాజులు, చెవిరింగులు, చేతి ఉంగరాలు, నుదుట నందు ఆభరణాలు, చీలమండల వద్ద(యాంక్లెట్స్) ధరించే ఆభరణాలు సర్వసాధారణంగా కనిపించేవి. హరప్పా ప్రజల కాలంలోనే ఆభరణాల తయారీలో అద్భుతమైన కళా నైపుణ్యం ఉండేది. ఎంతో జటిలమైన డిజైన్లతో ఆ రోజుల్లోనే స్వర్ణకారులు, వెండి పనివారు ఆకర్షణీయమైన ఆభరణాలు తయారు చేసేవారు.

హరప్పా ప్రజల సందర్భానుసారంగా అంటే మతపరమైన కార్యక్రమాల్లో ఒక రకమైన ఆభరణాలు, కర్మకాండలు సమయంలో మరో రకమైన ఆభరణాలు చిహ్నాలుగా ధరించేవారు. సమాజంలో స్టేటస్ సింబల్‌గా ఆభరణాలు ఉండేవి. స్థూపాకారపు గొట్టపు పూసలు హరప్పా ప్రజల ప్రత్యేకత. చిన్నచిన్న పూసలతో ఆభరణాలు తయారు చేసుకుని వ్యక్తిగతంగా ధరించేవారు.


ఆర్కియాలజికల్ తవ్వకాల ద్వారా హరప్పా మెహంజోదారో ప్రజలు పూసలు, గాజులు, మొండెపు భాగంతో గల ఆభరణాలు స్త్రీలు, పురుషులు ధరించేవారు అని తెలుస్తోంది.

అంతేకాకుండా, వివిధ రకాల లోహాలు, విలువైన రాళ్ల(నవరత్నాలు)తో తయారైన ఆభరణాలతో ఇతర దేశాలతో వర్తక వాణిజ్య సంబంధాలు కలిగి వున్నారని తెలుస్తోంది. బంగారం సూర్యుడికి ప్రతీకగా, వెండి చంద్రుడికి ప్రతీకగా భావించేవారు. బంగారం, వెండిని సర్వోత్కృష్టమైనవిగా ఆనాటి నుంచి నేటి వరకూ భారతీయులు భావించటం వల్ల ధర ఎంత పెరుగుతున్నా పేదవాడి నుంచి ధనికులు వరకూ వీటిపై మోజుతో ధరించటం ఆనవాయితీగా వస్తోంది. మరీ ముఖ్యంగా ఈ సృష్టి అంతా 'హిరణ్య గర్భ(గోల్డెన్ వూంబ్)' నుంచే ఉద్భవించింది అని విశ్వసిస్తారు. ముఖ్యంగా గత రాజ వంశీయుల పాలనలో బంగారం, వెండి, విలువైన రాళ్లతో తయారు చేసిన ఆభరణాలు కొన్ని వర్గాల ప్రజలు మాత్రమే ధరించాలి అనే శాసనాలు, నియమాలు ఉండేవి. ముఖ్యంగా పాలించే రాజులు/రాణి ప్రత్యేకతమైన ఆభరణాలు ధరించినట్లు చరిత్ర చెబుతోంది. కాళ్లకు ధరించే ఆభరణాలు కూడా రాజ వంశీయులు మాత్రమే ధరించాలి అనే నియమం ఉండేది. రాజు దేవునితో సమానం అనే భావన ప్రజల్లో ఉండేది. రాజులు నవరత్నాలతో తయారు చేసిన ఆభరణాలు ధరించేవారు. వజ్రాలు వంటి విలువైన రాళ్లతో తయారు చేసిన ఆభరణాలు ఎక్కువగా ధరించేవారు. ఓడిపోయిన రాజులకు వజ్రాన్ని ముక్కలు చేసి భోజనంలో కలిపి చంపే విధానాలు కూడా ఉండేవి. వివిధ వంశాల రాజులు బంగారం, వెండి విలువైన రాళ్ల వజ్రాలు వంటి కోసమే పొరుగు దేశాల రాజులపై యుద్ధాలు చేసేవారు. ఆ రోజుల్లో ఆ మాటకొస్తే- ఈ రోజుల్లోనూ బంగారమే ఒక దేశం



గొప్పతనాన్ని, ఆర్థిక పరిపుష్టికి నిదర్శనంగా నిలుస్తుంది. వజ్రాలను భూమి నుంచి తవ్వి తీసే శక్తి ఆ రోజుల్లోనే భారత్‌కు ఉంది.

కొన్ని ముఖ్యమైన మత పరమైన కార్యక్రమాల్లో ముఖ్యంగా హిందూ, జైన, మత కార్యక్రమాల్లో, పండుగల్లో బంగారం, వెండి విలువైన ఆభరణాలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి. సర్వసాధారణంగా సమాజంలో జరిగే



వివిధ కార్యక్రమాలు పెళ్లిళ్లు, ఫంక్షన్ సందర్భాల్లో ఈ ఆభరణాలే స్టేటస్ చిహ్నంగా మారాయి. అందానికి, అలంకరణలతో పాటు ఆర్థిక, సాంస్కృతిక స్థాయిని కూడా ఈ ఆభరణాలు ప్రతిబింబిస్తాయి. ముఖ్యంగా మన కుటుంబాల్లో బంగారం, వెండి మహిళల సొత్తుగా వారసత్వంగా వస్తుంది. తమ తమ పిల్లలకు, ఆడపిల్లలకు ఆభరణాలు పుట్టింటి ఆస్తిగా వస్తున్నాయి. ఆధునిక కాలంలో కూడా రకరకాల మోడల్స్, డిజైన్లతో బంగారం, వెండి ఆభరణాలు మార్కెట్లో లభ్యమవుతున్నాయి. విదేశాల నుంచి కూడా ధనికులు దిగుమతి చేసుకుంటున్నారు. 'పిసరంతైనా బంగారం, వెండి లేని గృహం భారత్‌లో లేదు' అంటే అతిశయోక్తి కాదేమో. అలా నాటి నుండి నేటి వరకు మన దేశంలో ప్రతీ కుటుంబంతో బంగారం, వెండి ఆభరణాలతో మన జీవితం ముడిపడి ఉంది.

ఈ విధంగా భారతీయ సమాజంలో ఆర్థిక, సాంస్కృతిక, సామాజిక అభివృద్ధిలో ఆభరణాలు ఒక స్టేటస్ చిహ్నంగా కొనసాగుతూ ఉన్నది. అదే సందర్భంలో మూడు పూటలా తిండి లేనివారు భారత్‌లో అనేకమంది ఉండటం కూడా బాధించే విషయం. సంపద వికేంద్రీకరణ దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. అందరూ సమానమే అన్న దిశగా రాజ్యాంగం సూచించిన సమ సమాజం వర్ధిల్లాలని ఆశిద్దాం. ఆభరణాలు కంటే ఆకలి లేని భారత సమాజం నిర్మించడం మన అందరి కర్తవ్యం.

# 'తెలుగు' గాలికొదిలేస్తే!

**జయసూర్య**

**మన రోజువారీ మాట్లాడే వ్యవహారంలో ఆంగ్ల పదాల అలవాటు వేగంగా చొచ్చుకుపోతోంది. మనకు తెలియకుండానే మన మాతృభాషలో వుండే సహజమైన పదాలను గాలికొదిలేసి ఆంగ్లం ఆశ్రయిస్తున్నాం. ప్రత్యామ్నాయంగా మన తెలుగులో అదే అర్థాన్ని యిచ్చే పదాలు వున్నప్పటికీ మనం వాటిని పట్టించుకోవడం లేదు.**

తెలుగులో జన సామాన్యానికి అర్థంకాని కృత్రిమ అన్య భాషా పదాలను వదిలి తేటతెలుగు మాటల ద్వారా భాషను కొంతవరకు అభిమానంతో ఆదరించవచ్చు.

తెలుగు నిఘంటువులలో వాడుక మాటలు అంతగా వుండవు. రాసే రాతకి, నోటి మాటకి వ్యత్యాసం వుంది. పండితులు, కవులు, రచయితలు తమ రచనలలో ఉపయోగించే పలుకుబడికి పామరులు, మాట్లాడే భాషకు తేడా వుంది.

పుస్తకాలు చదవని వాళ్ల జనాభా పెరుగుతోంది. అదే విధంగా చదవలేని పామర, సామాన్య జనం అసంఖ్యాకంగా వున్నారు. ఇప్పుడు వచ్చిన చిక్కల్లా ఏమిటంటే భాషా సంస్కారం కొరవడుతోంది. తెలుగు ఎంత సంస్కారవంతమైన భాష అంటే ఎవ్వరినైనా ఆవేశంతో, కోపంతో తిట్టాలంటే మాటలు రావు. పిల్లల్ని, కొన్ని మధ్య తరగతి పెద్దలకు కోపం పట్టలేకపోతే, తప్పు అని తెలిసినా కొందరికి అనకూడని మాటలు నోటంట వచ్చేస్తాయి. వెధవా, ఛీ, ఫో, శుంఠ వంటి చీత్కారాలు తీవ్రంగా వుండవు. కనుక సాధారణంగా బూతుపదాలు వాడేస్తారు. అమ్మ, ఆలి, అక్క, చెల్లి వంటి మాటల బూతులు వాడటానికి కొందరు సంకోచించరు.

పోనీ తిట్ల పురాణం గొడవ పక్కన పెట్టినా, తెల్లవారితే పళ్లు, గిన్నెలు కూడా తోముకోవడమే. దంత ధావనం అంటే అర్థం కాదు. అలాంటివి ఎన్నో. ఆంగ్లేయ పాలనా కాలంలో దేశ భాషలు నేర్చుకోవడానికి నిఘంటువులు పుట్టాయి. దేశీయ పదాలకు ఆంగ్ల భాషార్థం, ఆంగ్ల పదాలకు సరియైన దేశ్య శబ్దాలు తొలుత క్యాంబెల్ సమకూర్చాడు. తర్వాత చార్లెస్ ఫిలిప్స్ బ్రౌన్ తెలుగు భాషాభిమాని కాబట్టి పండితుల సహాయంతో బ్రౌణ్య నిఘంటువు పుట్టింది. కానీ అది ఆంగ్లం తెలిసిన వారికే ఉపయోగపడింది. అప్పటి దేశ మాన కాలం పరిస్థితులలో తెలుగుకు ఎంతో ఉపకరించింది.

ముందుగా భాష అంటే ఏమిటి? ఆలోచిద్దాం... మనుష్యులు తమ భావాలను ఇతరులకు తెలిపే సాధనమే భాష. భాష కాలానుగుణంగా మార్పు చెందడం సహజ పరిణామం. వాక్ రూపంలో వున్న భాషా స్వరూపం స్థిరంగా వుండదు. పైగా ఒక్కొక్క ప్రదేశంలో ప్రదేశ భేదాలు, వృత్తులు, విద్యావంతులను బట్టి ఏక భాషలోనే నోటి మాటలు విపరీతంగా మారిపోతుంటాయి.




తెలుగు భాష ఉనికికి ప్రాచీన ఆధారాలున్నాయి. శాతవాహనులకు పూర్వమే కోటి లింగాల నాణాల మీద లభించిన 'నారన'లోని 'అన' అనే బంధు వాచక పదమే మొట్టమొదటి ఆనవాళ్లుగా భావించాలి. ఇక్ష్వాకుల కాలం నాటి ప్రాకృత శాసనాల్లో 'తలవర' తెలుగు పదం వుంది. శాతవాహన రాజు హాలుడు క్రీ.శ.1వ శతాబ్దంలో సంకలనం చేసిన గాథా సప్తశతిలో అత్తా, పాడి, పొట్ట, తదితర తెలుగు పదాలున్నాయి. క్రీస్తుపూర్వం నాటికే తెలుగు ఉందనడానికి ఇవన్నీ ఆధారాలు.

తెలుగు మూడు వేల యేళ్లకు పూర్వమే ఉండి ఉంటుందని భాషా చరిత్రకారుల అంచనా. ఆధునిక కాలంలో తెలుగు భాషాభివృద్ధికి చరిత్ర క్రమంలో తెలుగు అడుగుజాడలు, సాహిత్యాభివృద్ధికి ఎంతో అన్వేషణ, అధ్యయనం, పరిశోధన సఫలీకృతమైంది.

బడి విద్య, పనులు నిర్వర్తించే ప్రదేశాలు, ప్రసార, ప్రచురణ మాధ్యమాలు, ప్రభుత్వ కార్యాలయ వ్యవహారాలలో వాడుకలో వుండే భాష మాత్రం ఎల్లకాలం సజీవంగా వుంటుందని ఐక్యరాజ్యసమితి విద్య, శాస్త్ర, సాంస్కృతిక సంస్థ(యునెస్కో) చెప్పింది. ప్రస్తుత ప్రసార, ప్రచురణ మాధ్యమాలలో కనపడే తెలుగు, 'బడి', 'ఇల్లు' 'కార్యాలయ' భాషగా వెలుగొందాలి. కానీ కొత్త కొత్త ఆంగ్ల పదాలు ప్రవేశిస్తున్నాయి తప్ప మరుగున పడిన పద సాహిత్యం వెలికితీసి కొత్త పదాలు ఎలా వినియోగంలోకి తేవాలో మేధావులు, సాహితీవేత్తలు, పాలకులు ఆలోచించాలి. బతుకుతెరువు కోసం ఆంగ్లాన్ని ఆశ్రయిస్తున్న యువతరం, మాతృభాషను గాలికొదిలేసే సంస్కార సంకుచిత్వానికి స్వస్తి చెప్పాలి.

స్వాతంత్ర్య పోరాటంలో అఖండ భారతావనిలో ఉత్తరాది జాతీయ నాయకత్వం హిందీకి ప్రాధాన్యత ఇచ్చింది.

దక్షిణాదిన హిందీ ప్రచార సభలు వెల్లివిరిసాయి. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు వరకు, దేశీయ భాషలను కేంద్రం పట్టించుకోలేదు. హిందీ రాజ్యభాషగా ఆధిపత్యం కేంద్ర పాలనాధిపత్యంలో కొనసాగుతోంది. దానికితోడు నైజామ్ పాలనా కాలంలో ఉర్దూ చెలామణీ మాధ్యమ భాషగా, జన వ్యవహారంలో రాజ్యం చేసింది.

ఏది ఏమైనా ఆంగ్లం, హిందీ, ఉర్దూ వంటి అన్య భాషలు వాటి ప్రభావం విస్తృతమైంది. అసంఖ్యాకంగా అన్య భాషా పదాల సాంకర్యంతో తెలుగు స్వచ్ఛత కోల్పోయింది. అదీగాక దేశ్య భాషలకు ఆదరణ అంతంత మాత్రమే.

నాడు భాషాభిమానం లేదు. ఉత్తరాది మహా నగరాల వైపు ఉద్యోగ, ఉపాధి అవకాశాల వలసలు, ఆధిపత్య రాజకీయాల కారణంగా మాతృభాషలు మరుగున పడ్డాయి. మనం కూడా తెలుగును గాలికొదిలేసి తప్పించుకు తిరగవలసి వచ్చింది. మాతృభాషా పరిరక్షణ గురించి ఆలోచించవలసిన దుస్థితి సంక్రమించింది.

# చిత్రసీమ పితామహుడు

**యామిజాల జగదీశ్**

చెన్నైలో అణ్ణాశాలై నుంచి పుదుప్పేట్టయ్‌కి వెళ్లే దారిలో ఉండేది గెయిటీ అనే సినిమా థియేటర్. పూర్వం మద్రాసులో ప్రేక్షకులకు ఇదొక ప్రధానమైన థియేటర్. భారతదేశంలో సినిమా ప్రవేశించిన కాలంలో దానిని మద్రాసుకు పరిచయం చేసిన వాటిలో గెయిటీ థియేటరు ఒకటి. గెయిటీ ప్రారంభమైన కథ, అందులో ప్రదర్శించిన సినిమాల కన్నా ముఖ్యమైనది, ఆసక్తికరమైనది.

మద్రాసులో మొట్టమొదట సెంట్రల్ రైల్వే స్టేషన్‌కి సమీపంలో ఉన్న విక్టోరియా పబ్లిక్ హాల్లోనే 1897లో ఓ సినిమా ప్రదర్శించడం విశేషం. దానిని సినిమా అని చెప్పలేం. ఎందుకంటే ఎన్నో ఫొటోలను 'స్లయిడ్ షో' లాగా ప్రదర్శించారు. ఈ స్లయిడ్ షోని ఎడ్వర్డ్ అనే ఐరోపా అతను ప్రదర్శించాడు.

ఆ తర్వాత వార్విక్ మేజర్ అనే ఆంగ్లేయుడు మౌంట్ రోడ్డులో ఎలక్ట్రిక్ థియేటర్ నిర్మించారు. ఇందులో కొన్నేళ్లపాటు సినిమాలు ప్రదర్శించారు. ఇదే మద్రాసులో మొట్టమొదటగా నిర్మించిన సినిమా థియేటర్. ఇది మద్రాసులోని ఆంగ్లేయులకు సాయంత్రాలు కాలక్షేపంగా ఉండేది.

ఈ క్రమంలోనే 1909లో ఇంగ్లండ్ యువరాజైన అయిదో జార్జ్ మద్రాసు వచ్చారు. ఆయన రాకను పురస్కరించుకుని సంబరాలు చేసారు. ఇందులో భాగంగా ఓ ఎగ్జిబిషన్ కూడా ఏర్పాటు చేశారు. అలాగే శబ్దంతో కూడిన షార్ట్ ఫిలిమ్స్ కూడా ప్రదర్శించారు.

ఇందుకోసం బ్రిటన్ కంపెనీ ఒక పరికరాన్ని (క్రోనో మెగాఫోన్) తీసుకొచ్చారు. ఇది మరేమిటో కాదు, గ్రామఫోన్‌తో కూడిన ప్రొజెక్టర్. తెరపై దృశ్యం కదలుతుంటే దానికి తగ్గట్టు అప్పటికే రికార్డు చేసిన శబ్దం గ్రామఫోన్ నుంచి ధ్వనిస్తుంది. నటుల పెదవుల కదలిక, తెర మీద వచ్చే శబ్దంతో సింక్రయ్యేది. ఈ ప్రదర్శనలు మద్రాసు వసులను విశేషంగా ఆకట్టుకుంది.

దీనిపై రఘుపతి వెంకయ్య అనే ప్రముఖ స్టిల్ ఫొటోగ్రాఫర్ దృష్టి పడింది. ఆయనకో ఆలోచన వచ్చింది. ఆ ప్రదర్శన ముగియడంతోనే ఆ పరికరాన్ని బ్రిటన్ సంస్థ నుంచి ముప్పై వేల రూపాయలకు కొనుగోలు చేశారు. ఆ పరికరం వెంకయ్య జీవితాన్నే మార్చేసింది.

మద్రాసు హైకోర్టుకు సమీపంలో ఓ షెడ్డు ఏర్పాటు చేసి ఆ పరికరంతో చిత్రం చూపించారు. ప్రజలు గుంపులు గుంపులుగా వచ్చారు. అనంతరం ఆ పరికరంతో దేశమంతా పర్యటించి చిత్రాలను ప్రదర్శించసాగారు.

ఆ తర్వాత శ్రీలంక, బర్మా తదితర దేశాలకు తన పరికరాన్ని తీసుకుని, కొంతమంది సిబ్బందితో కలిసి వెళ్లారు.

అల్లావుద్దీన్ అద్భుత దీపంలా ఈ పరికరం వెంకయ్యకు డబ్బులు సంపాదించి పెట్టింది. అలా సంపాదించిన లాభాలతో మూకీ చిత్రాలను ఎప్పుడూ ప్రదర్శించడం కోసం చెన్నైలో ఓ సినిమా థియేటర్ నిర్మించారు. దక్షిణ భారతదేశంలో ఓ భారతీయుడు నిర్మించిన మొదటి థియేటర్ ఇదే. అలా 1914లో ప్రారంభమైనదే గెయిటీ థియేటర్.

ఈ థియేటరుకి ప్రేక్షకులు భారీ సంఖ్యలో వస్తుండటాన్ని దృష్టిలో పెట్టుకుని వెంకయ్య మద్రాసులో ఒకదాని తర్వాత ఒకటిగా థియేటర్లు కట్టించారు. తుంగశాలై కూడలిలో క్రౌన్ థియేటర్, దాని తర్వాత పురసైవాక్కం హైరోడ్డులో గ్లోబ్ థియేటర్ వచ్చాయి. ఈ మూడు థియేటర్లలో మూకీ చిత్రాలు ప్రదర్శించేవారు.

మిలియన్ డాలర్ మిస్టరీ, మిస్టరీస్ ఆఫ్ మీరా, క్లచ్చింగ్ హ్యాండ్, బ్రోకన్ కాయిన్, రాజాస్ కాస్కెట్, పెరల్ ఫిష్, గ్రేట్ బార్డ్ వంటి మూకీ చిత్రాలను విదేశాల నుంచి రప్పించి తన మూడు థియేటర్లలోనూ ప్రదర్శించారు. ఇలా హాలీవుడ్ సినిమాలను ఆ రోజుల్లోనే మద్రాసు వాసులకు పరిచయం చేసిన ఘనత వెంకయ్యకు దక్కింది.

ఆ సమయంలోనే మన భారతదేశంలో 'హరిశ్చంద్ర', 'కీచకవధ' వంటి మూకీ చిత్రాలు విడుదలయ్యాయి. వెంకయ్య ఈ రెండు చిత్రాలను తన మూడు థియేటర్లలో ప్రదర్శించారు. వీటి విజయం తర్వాత ఆయన చిత్ర నిర్మాణానికి పూనుకున్నారు. తన కుమారుడు రఘుపతి సూర్యప్రకాశ్‌ని లండన్‌కి పంపించి చలనచిత్ర రంగంలో శిక్షణ పొందేలా చేశారు.

అలాగే జర్మనీ హాలీవుడ్‌కి వెళ్లిన ప్రకాశ్ తిరిగి వస్తున్నప్పుడు 35 ఎం.ఎం.విలియంసన్ మూకీ చిత్ర కెమేరా ఒకటి కొనుక్కొచ్చారు. దీంతో వెంకయ్య, ప్రకాశ్ 'మీనాక్షి కళ్యాణం' అనే సినిమాను నిర్మించారు. అప్పట్లో ఫొటో తీయించుకుంటే ఆయుష్షు తగ్గిపోతుందన్న మూఢనమ్మకం ఉండటంతో ఇందులో నటించటానికి తమిళ నటులు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో మద్రాసులో ఉండిన ఆంగ్లో ఇండియన్‌లను తమ సినిమాలో



నటింపచేశారు.

సినిమాను పూర్తి చేసి, ప్రదర్శించినప్పుడు దానిని చూసిన వారికి ఎంతో ఆశ్చర్యం కలిగింది. కారణం.. సినిమాలో నటించిన వారెవరికీ తలలు కనిపించకుండా చేశారు. ఆంగ్లో ఇండియన్లను దేవుడి పాత్రలలో నటింపచేయడం వల్ల దేవుడు కోపగించుకుని అందరి తలలూ తీసేసారని మద్రాసువాసులు మాట్లాడుకున్నారు.

1932లో వెంకయ్య తన మూడు థియేటర్లలో టాకీ చిత్రాలు ప్రదర్శించేందుకు వీలుగా ఆధునిక పరికరాలను అమర్చారు. ఈ విధంగా ఆ కాలంలో మద్రాసువాసుల కలలకు ద్వారాలు తెరిచినవారు వెంకయ్యనే. 1914లో ప్రారంభమైన గెయిటీ థియేటర్ ఉన్నచోట ఇప్పుడు ఓ వాణిజ్య సముదాయం నిర్మించారు.

(మిగతా 28వ పేజీలో...)

చుట్టూ పచ్చని పొలాలు, ఎటు చూసినా కళ్ల ముందు నిర్మలమైన ఆకుపచ్చని ప్రకృతి. ఆహ్లాదం కలిగించే వాతావరణం. అలాంటి ప్రశాంత పరిసరాల మధ్యలో దర్శనమిస్తుంది శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ బాలకోటేశ్వర స్వామి కొలువైన గోవాడ దివ్యక్షేత్రం.

మహేశ్వరుడు కొలువైన అనేక దివ్యధామాలు మనకు భారతదేశం నలుమూలలా కనిపిస్తాయి. ఈ ప్రదేశంలో తవ్వకాలు జరిపినా శివలింగాలు వెలుగు చూస్తాయి. అంతగా విశ్వేశ్వరుని పట్ల అచంచల భక్తిభావాలు కలిగిన పవిత్ర భూమి మన భారతభూమి.

# రాహు-కేతు పూజలకు ప్రసిద్ధి

శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ బాలకోటేశ్వర స్వామి ఇక్కడ కొలువు తీరిన గాథ యుగాల కిందటిగా పేర్కొనాలి. ఈ ఆలయం ఇక్కడ ఏర్పడడానికి ఆధారాలు.

## చారిత్రక నిదర్శనాలు

గతంలో ఈ ప్రాంతాన్ని చోళుల వంశంలో నుండి విడివడి ఇక్కడ స్థిరపడ్డారని అంటారు. అదే చరిత్ర కారులు వీరు కన్నడ ప్రాంతానికి చెందిన పాలక వంశం అయిన చాళుక్య వారసులు అని పేర్కొంటారు. మరి కొందరు వీరిని 'వెలనాటి చోడులు' అని కూడా పిలుస్తారు.

చారిత్రక సత్యం ఏది ఏమైనా చందోలును రాజధానిగా ఈ ప్రాంతాన్ని పాలించిన వీరు విశాల ప్రాంతాన్ని కలిగి వున్నారు. తమ కీర్తిని శాశ్వతంగా నిలిపే ఎన్నో ఆలయాలను ఈ ప్రాంతంలో నిర్మించారు. వాటిల్లో తమ ఆరాధ్య దైవమైన కైలాసనాథుని ఆలయాలు అధికం అని చెప్పాలి. అలాగని వారు ఇతర దేవతారాధనలను అడ్డగించలేదు. అనేక విష్ణు ఆలయాలను నిర్మించారు, పునరుద్ధరించారు.

వీరి పాలనలో ఈ ప్రాంతం ఎంత గొప్పగా ఉన్నదన్న విషయాన్ని ఆనాటి కావ్యకర్త శ్రీ పాల్కురికి సోమనాథుడు తన 'బసవ పురాణం' కావ్యంలో వివరిస్తారు. ఈ ద్విపద కావ్యం లింగాయత్ వ్యవస్థాపకుడు, సంఘసంస్కర్త, కవి, తత్త్వవేత్త అయినా శ్రీ బసవేశ్వర జీవిత గాథను తెలియ జేస్తుంది. శ్రీ బసవేశ్వర పరమేశ్వరుని పట్ల తనకు గల భక్తిభావాన్ని 'వచన' అనే విధానంలో ప్రజలలోకి తీసుకొని వెళ్లారు. శివ గాయక భక్తులైన నయనారుల మాదిరి ఈయన కూడా నాటి కన్నడ ప్రాంతంలో ప్రజలను ప్రభావితులను చేయగలిగారు.

ఇక అసలు విషయానికి వస్తే ఇంతటి ప్రభావాల వలన వెలనాటి చోళ్లులు నిర్మించిన అనేక ఆలయాలు కాలప్రభావంతో మరుగున పడిపోయాయి, భూమిలో కలిసిపోయాయి.

అలాంటి ఒక ఆలయంలోని లయకారుని లింగమే నేడు గత శతాబ్ద కాలంగా గోవాడలో శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ బాలకోటేశ్వర స్వామిగా పూజలు అందుకొంటున్నది.

సుమారు వంద సంవత్సరాలకు పూర్వం కీ.శే. కూచిపూడి తిరుపతి రాయుడు పేరుమోసిన మోతుబరి. ప్రజల ఉపయోగార్థం, సంక్షేమార్థం అనేక పనులను చేయించేవారు. అలాంటి ఒక కార్యక్రమం చేపట్టారు. ఇప్పటి గుంటూరు నగరానికి సమీపంలో ఉన్న బుడంపాడు గ్రామంలో ఒక మంచినీటి చెఱువును తవ్వించడానికి నిర్ణయించారు. తవ్వుతున్నప్పుడు పానవట్టంతో పాటు బ్రహ్మసూత్రంతో దివ్యకాంతులు వెదజల్లుతూ లింగరాజు లభ్యమయ్యారు. ఏనాటి లింగమో! చెక్కుచెదరకుండా శోభాయమానంగా దర్శనమివ్వడంతో రాయుడు తమ గ్రామానికి తీసుకొని వచ్చారు. ఆ కాలంలో గోవాడ ఒక బ్రాహ్మణ అగ్రహారం. వేదవేదాంగాలను అభ్యసించిన బ్రాహ్మణోత్తములు నివసించేవారు. వారిని సంప్రదించి 1907వ సంవత్సరంలో లభించిన ఉత్తమ లింగాన్ని శ్రీ బాలకోటేశ్వర స్వామి పేరిట ప్రతిష్టించారు. క్రమక్రమంగా ఆలయం అభివృద్ధి చెందసాగింది. అనేక నూతన నిర్మాణాలు జరిగాయి.



ఇలపావులూరి వెంకటేశ్వర్లు

1930వ సంవత్సరం నుండి భక్తులకు లభించిన దివ్యానుభవాల కారణంగా ప్రభలతో అయిదు రోజుల పాటు మహా శివరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు. నేటికీ కోటప్పకొండలో సమానమైన ప్రభలు గోవాడలో కనపడతాయి అంటే ఈ ఉత్సవాల వెనుక భక్తుల పాత్రను శ్రీ బాలకోటేశ్వర స్వామి పట్ల వారి భక్తి విశ్వాసాలను అర్థం చేసుకోవచ్చు.

## ఆలయ విశేషాలు

తూర్పు ముఖంగా ఉన్న ప్రధాన ఆలయానికి పడమర వైపున ప్రవేశ ద్వారం ఉంటుంది. పచ్చని పొలాల మధ్య సువిశాల ప్రాంగణంలో అనేక దేవతామూర్తులు దర్శనమిస్తారు. తూర్పున అయిదు అంతస్థుల రాజగోపురం నిర్మించారు. ప్రాంగణంలోకి ప్రవేశించగానే శ్రీ వినాయకుడు, శ్రీ జ్ఞాన సరస్వతీదేవి, గౌతమ బుద్ధుడు, శ్రీ షిర్డీ సాయిబాబా, శ్రీ అభయాంజనేయ స్వామి ఉపాలయాలు కనిపిస్తాయి.

తూర్పు వైపున వటవృక్షం కింద అనేక నాగ ప్రతిష్టలు ఉంటాయి. రాహు-కేతు పూజలకు ప్రసిద్ధి ఈ ఆలయం. మరో పక్కన పద్మాసన భంగిమలో శ్రీ గంగాధరుడు కొలువయ్యాడు.

అక్కడే నింగిని తాకేలా ఏర్పాటు చేసిన ధ్వజస్తంభం, బలిపీఠాలు ఉంటాయి.

పూజాదులు, హోమాలు నిర్వహించడానికి అనువుగా విశాలమైన ఆస్థాన మండపం నిర్మించారు. నందీశ్వరుడు గర్భాలయంలో లింగరూపంలో ఉన్న శ్రీ బాలకోటేశ్వర స్వామివారి ఆజ్ఞకు ఎదురు చూస్తున్నట్లుగా కనిపిస్తారు. విశేషం ఏమిటంటే విభూతి, కుంకుమ, పుష్ప అలంకరణలో శ్రీ బాలకోటేశ్వర స్వామి బ్రహ్మసూత్రం కలిగిన లింగ రూపంలో దర్శనమిస్తారు.

ఇరుపక్కలా ఉన్న రెండు సన్నిధులలో శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రుడు, శ్రీ పార్వతీదేవి కొలువై భక్తులను అనుగ్రహిస్తారు.

శ్రీ బాలకోటేశ్వర స్వామివారి ఆలయంలో మరో విశేషం కనపడుతుంది. సహజంగా ప్రతి శివాలయంలో నవగ్రహ మండపం ఉండటం విధాయకం. అయితే ఈ ఆలయంలో మొదటి నుండి లేదు. భక్తులు, ఆలయ పెద్దలు కలిసి 1988లో అష్టకోణ మండపాన్ని నిర్మించి, అందులో నవగ్రహాలను పీఠ, వాహన, సతీ సమేతంగా ప్రతిష్టించారు.

ఆ విధంగా చూస్తే గోవాడలోని నవగ్రహ మండపం ప్రత్యేకమైనది. మండపం వెలుపల ప్రత్యేక అద్దాల సన్నిధిలో వాయస వాహనంతో కలిసి శ్రీ శనేశ్వరుడు దర్శనమిస్తారు. ఏలినాటి, అర్ధాష్టమ శని ప్రభావం ఎదుర్కొంటున్నవారు ప్రత్యేక పూజలు జరిపించుకొంటారు.

## విశేష పూజలు, ఉత్సవాలు

ప్రతినిత్యం నాలుగు పూజలు జరిగే ఈ ఆలయం ఉదయం ఏడు గంటల నుండి మధ్యాహ్నం పన్నెండు వరకు;



తిరిగి సాయంత్రం నాలుగు నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు భక్తుల దర్శనార్థం తెరిచి ఉంటుంది. శ్రీ వినాయక చవితి, శ్రీ సుబ్రహ్మణ్య షష్టి, శ్రీ దేవీ నవరాత్రులు, మహా శివరాత్రి, శ్రీరామనవమి, శ్రీ హనుమజ్జయంతి, ఉగాది మొదలైన పర్వదినాలలో పెద్ద ఎత్తున భక్తులు తరలి వస్తారు.

అయిదు రోజుల పాటు నిర్వహించే మహా శివరాత్రి తిరునాళ్ల గోవాడను జనసంద్రంగా మార్చివేస్తాయి. దూర ప్రాంతంలో స్థిరపడిన గ్రామస్థులు శివరాత్రి ఉత్సవాలలో పాల్గొనడానికి వస్తారు. చుట్టుపక్కల గ్రామాలు, పట్టణాల నుంచి కూడా భక్తులు తిరునాళ్లను చూడటానికి వస్తారు. చుట్టూ పచ్చని పంటపొలాలతో ప్రశాంత వాతావరణం మధ్యలో దేవతా వృక్షాలుగా కీర్తించబడే మారేడు, జమ్మి, తెల్ల జిల్లేడు, గన్నేరులతో నిండిన ప్రాంగణం, అనేక దేవీ దేవతల స్థిరనివాసం, మహేశ్వరుడు అమ్మవారితో కలిసి కొలువైన దివ్య క్షేత్రం గోవాడ నిరంతరం ఆధ్యాత్మిక సౌరభాలను వెదజల్లుతుంది.

గోవాడకు తెనాలి, గుంటూరు, పొన్నూరు నుండి సులభంగా రహదారి మార్గంలో చేరుకోవచ్చు. వసతి సౌకర్యాల కోసం తెనాలి/గుంటూరు పట్టణాల మీద ఆధారపడాలి. గోవాడకు సమీపంలోని చందోలులో శ్రీ బగళాముఖీ అమ్మవారి ఆలయం, పొన్నూరులో శ్రీ సాక్షి భావన్నారాయణ స్వామి ఆలయం ఎత్తైన శ్రీ ఆంజనేయ, శ్రీ గరుత్మంతుని ఆలయాలతో పాటు మరికొన్ని పురాతన ఆలయాలు ఉన్నాయి.

గుంటూరు నుండి పొన్నూరు వెళ్లే దారిలో వచ్చే చేబ్రోలు దేవాలయాల గని. శ్రీ పంచముఖ బ్రహ్మ ఆలయంతో సహా అనేక పురాతన ఆలయాలు ఉన్నాయి. ఒక ప్రణాళికతో ప్రయాణం చేసినట్లయితే వీటన్నింటినీ ఒక రోజుల్లో దర్శించుకోవచ్చు.

## 'ఓయ్! నువ్వు సూపర్‌ఎహే'




నేను నచ్చానా నీకు? అని అడిగితే
మెయిల్ పెడతానని మెలిక పెట్టావు..
చిత్రంగా ఫేస్ మాడిపోయినా
మేడిపండులా ఉండాలని రాని నవ్వుని
పెదాల పైకి రప్పించాను
కామ్‌గా...
వారం రోజులుగా పగలు ఆఫీస్‌లో
రాత్రుళ్లు బాల్కనిలో మేల్కొనే
జాగారం చేశాను
అయినా... మెయిల్ వచ్చిన అలారమే
మోగలేదు సుమీ!
నీకు ఇష్టం లేదేమోనని బాధగా భారంగా
బతుకీడుస్తుంటే
సడన్‌గా ఒకరోజు ఫోన్ చేసి
ఫోన్ చేయడం లేదు.. ఎందుకు? అని
కేకలేసావు డిటీఎస్‌లో.
కోపాన్ని అణిచిపెట్టి మెయిల్ మ్యాటర్
గురించి అడిగితే
పెడదామనుకున్నా బట్ లైవ్‌లో చెప్తే
బాగుంటుంది కదా అని
పెట్టలేదని గోముగా చెప్పి మళ్లీ నాలో
ఆశ పుట్టించావు.
అంతే..! గోముగా నేను మళ్లీ ఎప్పుడు
కలుద్దాం బంగారు అని అడిగితే
కలుద్దాం లేరా తొందర్లోనేనని మాట
కొట్టిపారేసి నా ఏటీఎం కార్డు
కొట్టేసావు... గారాలు పోతూ గాలం
వేసి..
ఆల్‌మోస్ట్.. సిటీలో మల్టిప్లెక్సులు
అన్నీ తిరగేసి కార్డు గోకుతూ
ఐ లవ్ యూ తప్పా అన్నీ చెప్పి...
త్వరలో కలుస్తా బుజ్జి కార్డుతో అంటే-
మళ్లీ రీఛార్జ్ అయ్యి గాల్లో తేలాను.
కార్డుతో కలుస్తానంటే నా ఏటీఎం
కార్డుతో అనుకున్నా బంగారం!
నీ వెడ్డింగ్ కార్డుతో అనుకోలేదు.
నన్ను క్షమించు..

- గిరి పట్ల

**నిత్య జీవితంలో కొందరు సరదాగా మాట్లాడుతూ, చలోక్తులు విసురుతూ, తమాషాగా మాట్లాడుతూ వుంటారు. హాస్య చతురతలతో మాట్లాడే వ్యక్తులంటే ఇష్టపడినవారెవరుంటారు? వారెక్కడ వుంటే అక్కడి వాతావరణంలో సంతోషం ఉంటుంది. నవ్వడం మానవుడికి ఒక వరం. నవ్వితే ఒక యోగం. నవ్వించడం ఒక భోగం. నవ్వలేకపోవడం ఒక రోగం.**

# హాస్యం దివ్యౌషధం

డా॥ పులివర్తి కృష్ణమూర్తి



నవ్వితే హ్యాపీ. నవ్వకపోతే బి.పి. ఇక నవ్వలేనివాడు పాపి అనుకోవాల్సిందే. మానవుడి సామాజిక సంబంధాల మనుగడలో హాస్యం, నవ్వులూ కీలక పరికరాలని అనేక సిద్ధాంతాలు పేర్కొంటున్నాయి. నవ్వు ఒక వ్యక్తిని శారీరకంగానేగాక, మానసికంగానూ ప్రభావం చూపుతుంది. జీవితంలోని భావోద్రేకాల్లో హాస్యం ఒకటి అంటారు మానసిక శాస్త్రవేత్తలు. చాలామంది పెద్దలు జోకులను ఎక్కువగా చదవడానికి ఇష్టపడతారు. హాస్యం పండించే చలనచిత్రాలను బాగా చూస్తారు. అందుకే సినిమాల్లో కూడా ఎంతటి గొప్ప కథాచిత్రమైనా కొంతలో కొంతైనా హాస్య సన్నివేశాలు వుంటేనే రక్తి కడతాయి. ఆ సినిమాలు బాగా ఆదరణకు నోచుకుంటాయి. మానవ జీవితాల్లోని సంఘటనలనూ, వ్యక్తుల ప్రవర్తనలనూ కూడా గమనించి, వాటి నుండి కూడా హాస్యాన్ని పుట్టించి పండించినవారు మనకు కోకొల్లలుగా కనపడతారు.

మనం జోకులు వేస్తే నవ్వేవాళ్లు కావాలి. ఆ అవసరం కూడా వుంటుంది. అలాగే మనలను నవ్వించేవారూ కావాలి. అలాంటి స్నేహితులనే సాధారణంగా మనం ఇష్టపడతాం. కుటుంబాల్లో ముఖ్యంగా భార్యాభర్తల సంబంధాలలో అప్పుడప్పుడూ అభిప్రాయ భేదాలు తలెత్తుతాయి. ఆ సమయంలో సరదాగా మాట్లాడే హాస్యప్రియుల అవసరం ఎంతైనా వుంది. వారు ఎంతటి సీరియస్ వాతావరణాన్ని అయినా తమ జోక్స్‌తో ఐస్ బ్రేకర్‌లాగా ఉపయోగపడగలరు. చర్చలూ, వాదోపవాదాల్లో హాస్యం ఒక పెద్ద మిరాకిల్‌గా ఉపయోగపడుతుంది.

పండగలప్పుడు, శుభ కార్యాలప్పుడు, కొన్ని ప్రత్యేక సందర్భాల్లోనూ ఎవరికి వారు సీరియస్‌గా కూర్చున్నారనుకోండి.. ముభావంగా వున్నారనుకోండి... అప్పుడు ఎలా వుంటుందో ఊహించుకోండి. ఆ సమయంలో హాస్యపు జల్లులు కురిస్తే, నవ్వులు విరబూస్తే వాతావరణం ఒక్కసారిగా ఆహ్లాదకరంగా మారిపోతుంది. ఆ సందర్భానికి ఒక జీవం వచ్చినట్లుగా ఉంటుంది. జీవితంలో సవాళ్లు ఇబ్బందిగా పరిణమించే సమయంలో హాస్యపూరిత ధోరణి, దృక్పథం ఆ పరిస్థితుల్ని ఎదుర్కోగల మెకానిజంగా మారగలదు. కొందరికి హాస్యం నచ్చకపోవచ్చు. ఎందుకంటే వాళ్లకు అలాంటి సీరియస్ పరిస్థితులు కల్పించి కష్టం కలిగించడమే ఇష్టంగా వుంటారు. కానీ కొందరు మహానుభావులు వారిని కూడా తమ హాస్య సంభాషణలతో దారికి తెస్తారు. వారి కబుర్లలో దొర్లే హాస్యం టానిక్‌లాగా పని చేస్తుంది. హాస్యం ప్రధానంగా వుండే రచనలు చదవడం ద్వారా వ్యతిరేక, ప్రతికూల ధోరణులు వుండే అవకాశం వుండదు. చాలామంది ఒత్తిడి, టెన్షన్‌లకు గురవుతూ వుంటారు.

ఒత్తిడికి హాస్యం ఒక మందు లాంటిది. జీవితంలో విజయం సాధించాలనుకునే వారికి ముఖ్యంగా రిలేషన్‌షిప్ బాగుండాలి. అలాంటి వారికి ఈ హాస్యం ఒక ఉపకరం. హ్యూమర్‌ను ఎప్పుడు ఎలాంటి సందర్భాల్లో వాడాలన్నది చాలా ముఖ్యం. అది తెలిసి ఉండాలి. లేదంటే అపహాస్యం పాలవుతారు.

తస్మాత్ జాగ్రత్త సుమా!

(25వ పేజీ తరువాయి...)

## చిత్రసీమ పితామహుడు

గెయిటీ థియేటర్ మద్రాసులో కనిపించకుండా పోయినట్టు ఆ సినిమా హాలు నిర్మించిన వెంకయ్య జ్ఞాపకమూ అక్కడ తెరమరుగున పడింది. అవును.. మద్రాసు వాసులకు సినిమాను పరిచయం చేయడంలో ముఖ్యపాత్ర రఘుపతి వెంకయ్యదే అనే విషయాన్ని తమిళ సినిమా మరచిపోయింది. కానీ ఆంధ్రుల జ్ఞాపకంలో ఆయన ఎప్పటికీ ఉంటారు. తెలుగు చలనచిత్ర పరిశ్రమలో లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ చేసిన వారికి రాష్ట్ర ప్రభుత్వం వెంకయ్య పేరిట అవార్డు ఇస్తుండటం గమనార్హం.

తెలుగు చలనచిత్ర రంగానికి ఆయనను పితామహుడుగా చెప్పుకోవచ్చు. ఈయన ప్రసిద్ధ సంఘ సంస్కర్త దివాన్ బహద్దూర్ రఘుపతి వెంకటరత్నం నాయుడు గారి సోదరుడు.

రఘుపతి వెంకయ్య స్వస్థలం మచిలీపట్నం. ఆయన తండ్రి, తాత, ముత్తాతల కాలం నుంచీ సైన్యంలో సేనానాయకులుగా పని చేసినవారే. 1869 అక్టోబరులో జన్మించిన ఈయన 1941లో మరణించారు.

**వాస్తువార్త**
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్
సెల్స్: 9885446501/9885449458



# పరిస్థితులు మారాలంటే?



**బి.భరద్వాజ్ – ఇల్లందు**

**ప్రశ్న: అప్పు చేసి ఇల్లు కట్టించాను. నెల నెలా అప్పు పెరిగిపోతున్నది. అప్పుల బాధలు పడలేక ఇల్లు అమ్మకానికి పెట్టాను. కానీ సరైన బేరం రావడం లేదు. ఏం చేయాలో అర్థం కావడం లేదు. ఏం చేస్తే నా పరిస్థితిలో మార్పు వస్తుంది?**

**జవాబు:** ఇంటి వరండాగా వాడుతున్న నైరుతి స్థలంలో ఇంటికి తగలకుండా పశ్చిమ, దక్షిణ గోడలను ఆనుకుని బాత్‌రూమ్ నిర్మించండి. ప్రస్తుతం పశ్చిమ-వాయవ్యంలో యింటికి ఆనుకొని కట్టుకున్న బాత్‌రూమ్‌ని పూర్తిగా తొలగించి అక్కడ ఇంట్లోకి ప్రవేశించే ప్రధాన ద్వారం తెరవండి. ఆ ప్రవేశ ద్వారానికి ఎదురుగా ద్వారాలు తెరచి నడక తూర్పు-ఈశాన్యం నుండి పశ్చిమ వాయవ్యంవైపు సాగేలా చూడండి. నీచ స్థానంలో వున్న ఆర్థిక, ఆరోగ్య పరిస్థితులు తప్పక మెరుగవుతాయి.

## అప్పులు తీరే మార్గం?

**ఎస్.మనీష – కాకునూరు**

**ప్రశ్న: ఎప్పుడూ ఏదో ఒక సమస్య. ఎంత వచ్చినా అంతకు రెట్టింపు ఖర్చులు వచ్చి పడుతున్నాయి. దాంతో అప్పులు చేయక తప్పటం లేదు. నా సమస్యలకు మార్గం చెప్పగలరు.**

**జవాబు:** అంత పెద్ద భవనంలో మీరున్న గది వాయవ్య పోర్షనుగా గుర్తింపబడుతోంది. ఆ గదికి వున్న మూడు తలుపుల్లో రెండు నీచ స్థానంలో ఉన్నాయి. ఉచ్చస్థానంలోని ఒక్క గది ఎప్పుడూ మూసివేయండి. భవనంలోని మిగతా పోర్షను నుండి మీ గది వేరవుతోంది. గదికి పశ్చిమ-నైరుతికి వున్న తలుపు ద్వారానే మీ నడక జరగటం వల్ల మీకు చెడు ఫలితాలు ఎదురవడంలో ఆశ్చర్యం లేదు. ఆ ఒక్క తలుపును పశ్చిమ-వాయవ్యానికి మార్చుకోగలిగితే మీకు తప్పకుండా మంచి ఫలితాలు కలుగుతాయి.

## ఈ ఇంట్లో ఉండవచ్చా?

**ఎ.పారితోష్ – నాందేడ్**

**ప్రశ్న: నాన్నగారి అన్నదమ్ములు వాటాలు పంచుకోగా ఈ గృహం మాకు వచ్చింది. మా అన్నదమ్ములకు ఎవ్వరికీ సెటిల్‌మెంట్స్ లేవు. పొత్తు కుదరటం లేదు. నేను పెద్దవాడిని. ఈ ఇంట్లో మేం ఉండవచ్చా? ఎంత సంపాదించినా డబ్బు నిలవడం లేదు.**

**జవాబు:** మీ గృహానికీ, షాపులకీ మధ్యన ఒకదాని మూలపోటు మరొకదానికి తగులుతుండటం వలన మీరిప్పటికే అనేక నష్టాలు ఎదుర్కొన్నారు. మూలపోటు దోషాన్ని వెంటనే సవరించడం మంచిది. మీరు ప్రస్తుతం ఈశాన్య భాగంలో వుంటున్నారు. ఆ గృహంలో మీరు నైరుతి భాగంలో వుండటం మంచిది.

## పనులు జరగటం లేదు

**పి.మంజరి – కాకినాడ**

**ప్రశ్న: మేం రెండు ఇండ్లకు పునాదులు వేసాం. ఒక ఇల్లు కట్టించాం. అంటే పడమటిది. రెండవది పునాదులు వేసి వదిలేసాం. పక్కన వున్న వంకర స్థలాన్ని వదిలేసాం. దానివల్ల మాకు నష్టం కలుగుతుందా? మేం ఇల్లు కట్టినప్పటి నుండి ఏదో ఒక సమస్యతో బాధపడుతున్నాం. అనుకున్న పనులు జరగటం లేదు. ఈశాన్యంలో నుయ్యి తవ్వించాం.**

**జవాబు:** రెండు పోర్షన్లకు కూడా ఆగ్నేయ మూలలో మీరు బాత్ రూమ్, లెట్రిన్లు కట్టించారు. తూర్పువైపున వున్న పోర్షన్‌కి తూర్పు-ఆగ్నేయాన్ని ఆనుకొని వున్న లెట్రిన్‌ని నిర్మూలించి అదే లెట్రిన్‌ని ఆ పోర్షన్ నైరుతిమూల దక్షిణ, పశ్చిమ కాంపౌండు గోడలను ఆనుకొని బాత్ రూమ్‌ని కట్టించండి. ఇదే విధమైన తూర్పు, పశ్చిమ పోర్షన్‌కి కూడా చేయడం వలన మంచి మార్పులు కనిపిస్తాయి.

## లెట్రిన్ ద్వారం ఎటువైపు?

**ఎన్.వాసుదేవ్ – శ్రీకాకుళం**

**ప్రశ్న: లెట్రిన్ ద్వారం మూసివేయాలని అనుకుంటున్నాం. ఒకవేళ మూసివేస్తే ద్వారం ఎటువైపు పెట్టుకోవాలి? తెలుపగలరు.**

**జవాబు:** తలుపు సంగతి తరువాత.. మీరు లెట్రిన్‌ని ఇంటిలోపలి ఉత్తర గోడకు ఆనుకుని కట్టారు. అలా కట్టకూడదు. పశ్చిమం లేదా దక్షిణ మధ్యమంలో రెండు గదుల మధ్య హాల్లోకి తెరుచుకునేలా లేదా ఏదయినా బెడ్ రూమ్‌కి ఎటాచ్‌డ్ బాత్ రూమ్‌లో కట్టాలి.

## నైరుతి కలిసొస్తుందా?

**ప్రశ్న: కార్పెంటెర్‌గా పని చేస్తున్నాను. పేరు, సంపాదన బాగున్నాయి. కానీ ఎప్పుడూ ఏదో ఒక ఇబ్బంది ఎదురవుతూ ఉంటుంది. దక్షిణం సరిహద్దు చేర్చి నిట్రాళ్లు పాతి దక్షిణంవైపు పదిన్నర అడుగుల ఎత్తు, ఉత్తరంవైపు ఏడున్నర అడుగులు ఎత్తు వచ్చేలా మొత్తం తారురేకులు వేసాను. ప్రస్తుతం నైరుతి పడమరలో పని చేస్తున్నాను.**

**జవాబు:** ఈ ఇల్లు తూర్పు సరిహద్దును ఆనుకొని కట్టబడి వుంది. అదొక్కటే దోషం. తూర్పు వైపున ఖాళీస్థలం వచ్చేలా ఇంటిని సవరించి ఉచ్చస్థానం నడకకి ఏర్పాటు చేస్తే ఈ ఇంట్లో చాలా మంచి ఫలితాలు వుంటాయి. దక్షిణ ఆగ్నేయంలో ఉచ్చస్థానం వీధిపోటు వుండటం ఈ ఇంటికి సర్వత్రా శుభదాయకం. వాస్తు ప్రకారం చిన్న మార్పులు చేసినా శుభ ఫలితాలు త్వరగా కనిపిస్తాయి.



# వారఫలం

శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు, గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్: 9849453449, 9440927795

## మేషం



ప్రజా సంబంధాలు అధికంగా కలిగిన వ్యాపారస్తులకు అనుకూలంగా ఉంటుంది. సాఫ్ట్‌వేర్ రంగంలోని వారికి నూతన అవకాశాలు కలిసి వస్తాయి. సంతాన విద్యా విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తారు. పొదుపు చేసిన ధనాన్ని కొత్త పెట్టుబడులకు ఉపయోగిస్తారు. గ్రహ దోషాలు తొలగిపోవడానికి సర్వరక్షా చూర్ణంతో స్నానం చేయడం మంచిది.

## వృషభం



వ్యాపారస్తులకు మధ్యస్త ఫలితాలు గోచరిస్తున్నాయి. నూతన అవకాశాలు లభిస్తాయి. కీలకమైన నిర్ణయాలు తీసుకునేటప్పుడు నిష్ణాతుల సలహాలను తీసుకోవడం మంచిది. అగ్రిమెంట్లు, ముఖ్యమైన సంతకాలు చేసేటప్పుడు సాంకేతిక లోపాలు చోటు చేసుకోకుండా జాగ్రత్త పడండి. సినీ, కళా, సాహిత్య రంగాలలోనివారు అవాంతరాలను అధిగమిస్తారు.

## మిథునం



ఆరోగ్య సమస్యలను అధిగమిస్తారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది. కీలక నిర్ణయాలలో స్వంత ఆలోచనలు చేయటం మంచిది. అష్టమూలికా తైలం, లక్ష్మీ తామర వత్తులతో దీపారాధన చేయటం మంచిది. అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయం ఏర్పడుతుంది. మానసిక, శారీరక శ్రమ అధికం.

## కర్కాటకం



అదనపు ఆదాయ మార్గాలు లభిస్తాయి. అయితే ఇవి తాత్కాలికమైనవి. ఊహాజనితమైన మాటలతో మిమ్మల్ని నమ్మించడం కష్టమని ఇతరులు తెలుసుకుంటారు. ఉన్నతాధికారులు మీ శ్రమను గుర్తిస్తారు. తనఖా వస్తువులను విడిపిస్తారు. కోర్టు వ్యవహారాలు వాయిదాలలో ఉంటాయి. నరదృష్టి అధికంగా ఉంటుంది. పూజలలో నాగబంధం కుంకుమను ఉపయోగించండి.

## సింహం



పట్టుదలతో ముందుకు సాగుతారు. రుణాలు తీరుస్తారు. ఆదాయ-వ్యయాలు సరిసమానంగా ఉంటాయి. పుణ్యక్షేత్రాలను సందర్శిస్తారు. ఇంట్లోనూ, వ్యాపార ప్రదేశాలలోనూ సాంబ్రాణితో ధూపం వేయండి. ఉన్నతాధికారులతో మాట్లాడేటప్పుడు సంయమనం పాటించండి. విదేశీయాన ప్రయత్నాలు కలిసి వస్తాయి. ఇంట్లో శుభ కార్యాల ప్రస్తావన వస్తుంది.

## కన్య



ప్రజా సంబంధాలు అధికంగా కలిగిన వ్యాపారస్తులకు అనుకూలంగా ఉంటుంది. వాతావరణంలో మార్పుల కారణంగా అనారోగ్యాల బారిన పడే అవకాశం ఉంది. వైద్య పరీక్షలు చేయించుకుంటారు. నూతన వ్యాపార ఒప్పందాలు అనుకూలిస్తాయి. సామాజిక అంశాల పట్ల దృష్టి కేంద్రీకరిస్తారు. విద్యార్థులు కొత్త కోర్సులను ఎంచుకుంటారు.

## తుల



ముఖ్యమైన చర్చలను, వ్యవహారాలను సాధ్యమైనంత వరకు తాత్కాలికంగా వాయిదా వేసుకోవడం మంచిది. శ్వేతార్క గణపతికి సుమంగళి పసుపు, సిద్ధగంధం, ఆరావళి కుంకుమతో పూజ చేయండి, వాస్తుదోషాలు తొలగిపోతాయి. క్లిష్టతరమైన కార్యక్రమాలు మినహా తేలికగా జరిగేటటువంటి వ్యవహారాల పైన దృష్టి సారిస్తే లాభపడతారు. సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకుంటారు. కొత్త ఆలోచనలు చేస్తారు.

## వృశ్చికం



పలుకుబడి కలిగిన వ్యక్తులను కలుసుకొని సహాయం పొందుతారు. మీలోని ప్రతిభా పాటవాలు వెలుగులోకి వస్తాయి. ఆర్థికాభివృద్ధి సాధిస్తారు. కుటుంబ సమస్యలు తీరి ప్రశాంతత పొందుతారు. గృహ నిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి. వాహన యోగం పొందుతారు. ఆకస్మిక ప్రయాణాలు చేసి తద్వారా లాభపడతారు. ఇన్నాళ్లు మీ మనసులో దాగి వున్న భయం, భ్రాంతి నిష్కారణమైనవేనని తెలిపోతుంది.

## ధనుస్సు



వృత్తి, వ్యాపారాలలో ప్రోత్సాహం లభిస్తుంది. కళలు, వైద్య రంగాలలోని వారికి అనుకూలం. సంగీత, సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఆర్థిక పరిస్థితి అనుకూలంగా ఉంటుంది. అష్టమూలికా తైలం, నవగ్రహ వత్తులతో నవగ్రహాల దగ్గర దీపారాధన చేయండి. కుటుంబ సభ్యులతో కలిసి ఉల్లాసంగా గడుపుతారు. ఉద్యోగ బదిలీ యత్నాలను ముమ్మరం చేస్తారు.

## మకరం



సన్నిహితులు, మిత్రులతో కలిసి సంతోషంగా గడుపుతారు. గృహం, వాహనాలు కొనుగోలు యత్నాలు చేస్తారు. ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం. ఆరావళి కుంకుమ, శ్రీ లక్ష్మీచందనంతో అమ్మవారిని పూజించండి. మాటల చాతుర్యంతో అందరినీ ఆకట్టుకుంటారు. సహోదరీ వర్గానికి మీ వంతు సహాయ సహకారాలు అందిస్తారు. భూ వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. వృత్తి పరంగా కొత్త విశేషాలు తెలుసుకుంటారు.

## కుంభం




జీవిత భాగస్వామి సలహాలను ఆచరిస్తారు. అతిథి మర్యాదలకు అధికంగా ఖర్చు చేస్తారు. పిల్లల వివాహ ప్రస్తావన వస్తుంది. తత్సంబంధీకుల స్వతంత్ర నిర్ణయాలు ఇబ్బంది కలిగించవచ్చు. ప్రతిరోజూ నాగసింధూరం నుదుటన ధరించటం మంచిది. విరాళాలు, చందాలు, రుణాలు, పన్నుల విషయంలో ఒత్తిడి అధికమవుతుంది. పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తారు.


## మీనం



బహిరంగ సమావేశాల్లో పాల్గొంటారు. బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారు. రుణాలు ఇవ్వడం/తీసుకోవడం రెండూ కలిసిరావు. ఏ దేవుడికైనా, దేవతకైనా పూజ చేసేటప్పుడు అభిషేకంలో మహాతీర్థం పొడిని ఉపయోగించండి. కష్టించి పని చేసే తత్వం పెంచుకుంటారు. సంగీత, సాహిత్యాల పట్ల ఆసక్తి కనబరుస్తారు. పట్టుదలతో శ్రమించి వృత్తి, వ్యాపారాల పరంగా స్వల్ప అభివృద్ధి చేస్తారు.


ఆ రెస్టారెంట్ బిర్యానీ లా లేదా?
ఇది ఫ్రెష్ చికెన్ తో చేసింది గదండీ!!


టీజీ గా మార్చారు.. రాష్ట్ర గీతం తెచ్చారు.. రాజ ముద్ర మారుస్తార్ట.. ఇంకేం కావాల్రా కక్కుర్తి ఎదవా..!!


ముప్పై మంది ఆడాళ్లం రాష్ట్రం లోని గుళ్లు, దర్గాలు, చర్చిలు చూసొద్దాం అనుకుంటున్నాం.. ఒక పది రోజులు బస్సు ఫ్రీగా పంపిస్తారా సార్!?
-డిపో మేనేజర్-

# ఈ వారం కా'ర్టూన్స్'



భూతల
స్వర్గంగా పిలవబడే ఈ దీవిని
ఇలా దాస్ ఫ్లోరిస్ అంటారు.
పోర్చుగల్‌లో ఉందీ దీవి. బీచ్‌లు,
సరోవరాలు, జలపాతాలు కొదువ లేదు.
ఇలా దాస్ ఫ్లోరిస్ అంటే పూల
దీవి అని అర్థం.











